# యేసు వైపు చూచుచు

భక్తసింగ్

# వి ష య  సూ చి క


| | | | పుట |
|---|---|---|---|
| 1. | యేసువైపు చూచుచు | .... | 1 |
| 2. | చూచి వెంబడించుము | .... | 10 |
| 3. | చూచి శోభించుము | .... | 19 |
| 4. | చూచి ఆయనను పోలియుండుము | .... | 28 |
| 5. | చూచి విజయము పొందుము | .... | 41 |
| 6. | చూచి నేర్చుకొనుము | .... | 51 |
| 7. | ఆయన నిన్ను వెదకుచున్నాడు చూచి రక్షణపొందుము | .... | 57 |

# 1

# యేసువైపు చూచుచు

## యేసును ఎక్కువగా ఎరుగుట

తన అపొస్తలుడైన యోహానుకు తన పరలోక మహిమతో ప్రభువైన యేసుక్రీస్తు ఎట్లు ప్రత్యక్షమాయెనో ప్రకటన మొదటి అధ్యాయమందు చదువుచున్నాము. తన సువార్తయందు యోహాను అరుమార్లు "యేసు ప్రేమించిన .... శిష్యుడు" అని తన్ను తాను పిలుచుకొనుచున్నాడు. ప్రభువైన యేసుక్రీస్తుకు మిక్కిలి సమీపంగా నుండవలెనని అతనికి ఎంతఆశగా నుండెనో దీనివలన మనకు తెలియుచున్నది. కొందరు తమకు ప్రాముఖ్యతగోరుచు ఆయనను అంటియుండ జూచిరి. ఎవరైనా ఒక గొప్ప వ్యక్తి ఒక ఊరికి వచ్చినచో కొందరు ఆ వ్యక్తికి అతి సమీపంగా నుండకోరుదురు. ఎందుకనగా ఆ ప్రముఖుని మీద ప్రేమవలన కాదుగాని "ఫలాని ఆ వ్యక్తిని మేము చూచియున్నాము" అని చెప్పుకొనుచు మనుష్యులవలన ఘనతపొందవలెననియే. అయితే అపొస్తలుడైన యోహాను ప్రభువుకు అంత సమీపంగాకూర్చుండునది తనకు ఘనతకావలయుననికాదు. గాని ఆయనను ప్రేమించినవాడైనందున ఆయన ప్రేమను అనుభవించుటకే ప్రభువుకు సమీపంగా నుండెను. ఇతడు దేవుని ప్రేమను గూర్చి ప్రశంసించినంతగా మరే అపొస్తలుడుకూడా ప్రశంసించలేదు. తన జీవితకాలమంతయు ప్రభువైన యేసుక్రీస్తును ఎంత మట్టుకు చూచియుండెనో, అంతకంటె విస్తారంగా పత్మాసు ద్వీపమునందు తన వృద్ధాప్యమున ఆయననుచూచు భాగ్యము ప్రభువుపట్ల తనకుగల ప్రేమద్వారానే కల్గెను. అంత విచిత్ర రీతిని ప్రభువుయొక్క మహిమను యోహాను అదివరకు ఎన్నడును చూచియుండలేదు. ఆయనయొక్క మహిమ, సౌందర్య

ములను అనేకమారులు కొంతవరకే చూచియుండినను ఇప్పుడు ఆయనను పూర్తిగా వేరు విధముగ చూచెను.

మనలో అనేకమందికి యేసుప్రభువుతో అనేక అనుభవములు కలిగియుండవచ్చును. దీనికై దేవునికి వందనములు. అయినను దేవునివాక్యము చెప్పుచున్నదానిని బట్టి ఆయన విషయము చూడవలసినవి, నేర్చుకొనవలసినవి ఇంకెన్నియోయున్నవి. కొంతకాలం క్రిందట ఒక యువకుడు బొంబాయి వెళ్లెను. తిరిగి వచ్చిన తరువాత "బొంబాయి ఎలాగుంది?" అతని స్నేహితులడిగిరి. "చాలావిచిత్రంగాఉంది" అని అతడు జవాబిచ్చెను. "ఏ విషయంలో అంత విచిత్రం?" అని వారు అడుగగా, "ఎటువంటి బిరియాని మేమక్కడ తిన్నామో తెలుసా!" అని ప్రత్యుత్తరమిచ్చెను. బొంబాయి నగరపు మేడలుగాని, సముద్రం గాని తోటలుగాని, మనుష్యులుగాని, ఏదియు అతనిని ఆకర్షించలేదు. గాని అక్కడ బిరియానినే ఎంతో కుతూహలముతో పొగడుచు, సత్యమే చెప్పెను. అటువలెనే నీవు క్రీస్తును ఎక్కువగా నెరుగకుండుటవలన నీస్థితికూడ ఆ యువకునివలెనే యుండవచ్చును. అట్లున్నను ఆయనను చూచుటవలన దేవుడు మనకు ఎంతో ఎక్కువగా నిచ్చునని నిరీక్షించుచు ప్రార్థించుచున్నాను.

## ప్రియుడైన అపొస్తలుడగు యోహాను-ఏకాంత ఖైదు

మనలో అనేకులు అవమానపు, అపజయపు జీవితములు జీవించుచు సులభంగా అధైర్యముచెంది, నెమ్మదిలేక క్రుంగిపోవుచున్నాము. అపవాదివలన ఎంతసులభంగా మోసపోవుచున్నాము! శత్రువు చాలాయుక్తిగలవాడనియు, దుష్టుడనియు, బలముగలవా

దని మనలనుజాగ్రత్తగానుండుమని దేవునివాక్యం హెచ్చరించు చున్నది. గర్జించు సింహమువలె క్రూరతోడేలువలె, జలప్రళయం వలె లేక వెలుగుదూతవలె ఏ వేషంతోనైనను అతడు రావచ్చును. అయితే మన ప్రభువు: "ధైర్యం తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాను" అని చెప్పియున్నాడు (యోహాను 16:33). ఏ విధంగానైనను రానిమ్ము, మనదృష్టి మనమీద కాదు. జీవితం యొక్క అంతస్థుమీద కాదుగాని ప్రభువుమీదనే యుండవలెను. కీర్త. 46:10లో "ఊరకుండుడి, నేనే దేవుడనని తెలిసికొనుడి" అని చెప్పబడియున్నది. మనం ఊరకుండుటవలనే ప్రభువు ఎవరైయుండునది తెలిసికొనుచున్నాము. మనదృష్టిని ఆయన మీదనే నిలుపుటకొరకు అనేకకఠినమైన అనుభవములగుండా ప్రభువు మనలను నడుపును. ఆయన సత్య సౌందర్య మహిమ లను మనము ప్రోలవలెననునదియే అయనకోరిక. ఈదినములలో మనకోరిక సహితం యిదియే.

యోహాను ప్రభువుయొక్క అతిప్రియ శిష్యుడు. అయి నను దేవునివాక్యం బోధించినందుకును, యేసునుగూర్చి సాక్ష్య మిచ్చినందుకును ముసలి తనమున ఒక ఖైది యాయెను. ఆది వరకు కొన్ని సమయములలో ప్రభువు తన దూతనుపంపి చెర సాలనుండి తనసేవకులను విడిపించియుండెను. ఆయన చిత్తమై యుండినయెడల ఒక క్షణములో యోహానును విడిపించియుండ గలడు. అయితే యోహానును ఆ ఏకాంత స్థలములో ఖైదీగా నుండనిచ్చెను. ఒక ఘనమైనఖైదీని చూచుకొనునట్లుగాక, ఈ దైవజనుని, యేసుప్రేమించిన ఈ శిష్యుని ఒక సాధారణ ఖైదీగా నుంచిరి. యోహాను ఎంత నిరుత్సాహముచెందెనో, లోపల ఎన్ని పోరాటములుండెనో!

దేవుని వాక్యం ఎట్లు విస్తరించుచు, ప్రబలుచుండెనో అను విషయం అపో.కా. 6:7; 12:24; 13:49; 19:24 లలో చదువుచున్నాము. ఆయన శిష్యులు భూలోకమును అతి స్వల్ప కాలములో తలక్రిందులు చేసిరని దేవునివాక్యం చెప్పుచున్నది. వారు ఎక్కడికి వెళ్ళినను అక్కడివారికి వణకుపుట్టుచుండెను. అయితే అకస్మాత్తుగా భ్రష్టత్వమును సంభవించెను. అనేకమంది విశ్వాసులు తొలిప్రేమను విడిచిరి డబ్బు, లౌకిక లాభము, ఇంకను లోకమందు పొందగలిగిన ఇతర ఆకర్షణీయములైన వాటికొరకు వారు వెళ్ళిపోయిరి దేవునికన్న లోకభోగమునే వారు కోరుకొనిరి. మరికొందరైతే దేవునివాక్యం నిమిత్తము హింసలుపొందిరి. చెరలోకూడ వేయబడిరి. తుదివరకు ఇట్లు నమ్మకంగా నిలిచినవారు బహుకొద్దిమందిమాత్రమే. ఇవన్నియు చూచి యోహాను మనస్సులో చాలా కృంగెను. పత్మాసుదీవి ఎంత గొడ్డుప్రదేశమో ఆత్మీయంగా అంత గొడ్డుతనమే విశ్వాసులలో చూడగా యోహాను ఇట్లు విలపించెను: "ఓ ప్రభువా! ఎందుకు ఇంత ఆత్మీయ గొడ్డుతనం? నీ జనులు ఏల ఇంత చల్లారిపోయి, బలహీనులై, నిర్లక్ష్యంగలవారైరి? ప్రభువా, మేము పూర్వం చూచిన శక్తి ఇప్పుడెక్కడ?" అపొస్తలుని మనస్సునందు ఇట్టి ప్రశ్నలు బాధించుచుండెను. తన శరీర బాధలనుబట్టిగాని, అసౌఖ్యమునుబట్టిగాని ఆయన చింతించలేదని నేను తలంచుచున్నాను. ఎప్పుడైనను వాటినిబట్టి సణుగుకొనలేదు. అయితే ప్రతిస్థలమందలి దేవుని ప్రజలయొక్క ఆత్మీయ స్థితి విషయమై చింతించుచుండెను. శత్రువుయొక్క కార్యములు తీవ్రముగా సాగుటచూచి ఆయన అధైర్యపడెను. దేవునిప్రజలు శక్తిహీనులై, నిస్సహాయులైనందున ఆయన కృంగిపోయెను.

ప్రపంచమంతటి దేవునిప్రజలకును, ఆయన సాక్షులకును ఇటువంటి పరిస్థితియే ఈ దినములలో ప్రబలుచుండుట చూచుచున్నాము. యోహానువలె మనం కూడ "ఓ ప్రభువా! ఈలాగు జరుగుట ఎందుకు? ఎంతకాలం వరకు? దయతో మాకు జవాబిచ్చి, నీ మార్గం చూపించుము'' అని అనుచున్నాము.

**దేవుడు మాట్లాడుచున్నాడు-వినుము, తిరుగుము, చూడుము!**

దేవుని స్వరము మొదట తన వెనుకవైపున యోహానుకు వినబడెనని (ప్రకటన 1:10, 11, 12)లో చెప్పబడియున్నది. యోహాను ముందువైపున ఆయన ప్రత్యక్షము కాగలుగును కదా? అయితే అతని వెనుక ప్రత్యక్షమై అతనితో మాట్లాడుటలో ప్రభువు సంకల్పమొకటి యుండెను. బూరధ్వనివంటి గొప్ప స్వరముతో, స్పష్టమైన మాటలతో ప్రభువు ఇట్లు మాట్లాడెనని లేఖనము చెప్పుచున్నది: "ఆదియు అంతమును నేనే" 'నాతో మాట్లాడుచున్న స్వరమేమిటో అని చూడ తిరిగితిని" అని అపొస్తలుడు అనుచున్నాడు. యోహాను ఎదుటగాక వెనుక ప్రభువు ప్రత్యక్షమగుట ఏల? యోహాను మనస్సులోని ప్రశ్నలకు జవాబివ్వవలెననియే అట్లు ప్రత్యక్షమాయెను. అనగా ప్రభువు ఇట్లు పలికినట్లు దాని భావము: "నీ మనస్సులోని ఆలోచన నాకు సరిగా తెలియును. నీకలతలు, భీతి నేనెరుగుదును. నీవు అపజయమొందితివని తలచి ధైర్యహీనునిగా నున్నావు. అయితే యోహాను, నీవు తప్పుదిశలో చూచియున్నావు కావున వెనుకదిక్కు తిరుగుము. అప్పుడు నీప్రశ్నలన్నింటికి జవాబు దొరుకును. నీ సమస్యలన్నియు తీర్చబడును. నీవు వెనుకకు తిరిగినచో నన్ను చూతువు. నేనెవరినో తెలిసికొందువు" ప్రభువు విషయం అతనికి సమస్తము తెలియుననియు ఆయనచేసిన అద్భు

తములు బోధలు అంతయు నెరుగుననియు, ఆయన రూపాంత రమును, ఆరోహణమును కండ్లతో చూచినవాడనియు యోహాను చెప్పుకొనగలడు. అయినను ప్రభువుఏమనుచున్నాడు? "యోహాను నీ వింకను నన్ను ఎరుగవు. అల్ఫాయు, ఓమెగయు నేనే; ఆదియు అంతమును నేనే. నేను చెప్పుచున్నదాని పూర్తి అర్థము నీవు గ్రహింపకున్నావా? అయితే వెనుకను తిరిగి నన్ను చూడుము. నేనెవరినో తెలిసికొందువు.'' యోహానువెనుక; తిరిగి ఆయనను చూడగా ప్రభువు ఆ రీతిగా నుండుట అతడు ఎన్నడు చూచి యుండలేదు (వచనము 17) యోహాను ఆ దర్శనమును చూచి విభ్రాంతిచెంది "ప్రభువా, నీవింత మహిమగలవాడవని ఇంత గొప్ప వాడవని నాకు తెలిసియుండలేదు" అని అనెను. తన నిజరూపమును ప్రత్యక్షపరచుకొను నిమిత్తమే ఆయన యోహాను వెనుకనుండి మాటలాడెను.

## మానక యేసువైపు చూచుచునే యుండుము

ఆయన ఉన్నరీతిగా ప్రభువును మనము చూచుటలేదు. కావుననే మన జీవితములు అపజయముతో నిండియున్నవి. మన దృష్టి అస్థిరమై రెండుదిక్కులు చూచుచున్నాము. ఒక కన్ను ప్రభువుమీదను, మరియొక కన్ను లోకముమీదను ఉంచు చున్నాము.

అనేక సంవత్సరముల క్రిందట అలహాబాదులో ఒక దుకాణము పెట్టుకొనిన ఒక బ్రాహ్మణుని చూచితిని. ఆ దుకాణ ములో ఒక భాగమంతా విగ్రహములే; ఇంకొక భాగమందు బియ్యము, పంచదార మొదలైన సరకులు కనబడెను. అతడు ఇవతల సరకులు కొనవచ్చినవారి పనులు చూచుచుండెను; అవ

తల పూజచేయవచ్చినవారి పనులు చూచుచుండెను. గంట మ్రోగించి పూజలు చేయుచుండెను. మంచి చమత్కారముతో రెండు విధములైన పనులను సలుపుచుండెను ఒకవైపు కొన వచ్చినవారిని మోసం చేయుట ఎట్లో, రెండవవైపున విగ్రహ ములకు నమస్కరించుట ఎట్లోకూడ ఎరిగియుండెను. అనేక మంది విశ్వాసులసంగతికూడ ఇదే. ప్రభువువైపు ఒక కన్ను, ఇంక దేనిమీదనో రెండవ కన్ను ఉంచుదురు. ఆత్మీయ అంధ కారములోనికి వారు దిగుటకు ఇదే కారణము. నీవు ఆయనను వాస్తవముగా చూడగోరినట్లైతే రెండుకండ్లు కూడ ఆయనమీదనే నిలుపుము. రైలుబండినుండి దిగువారి నెవరినో ఇంటికి తీసుకొని పోవుటకు రైల్వేస్టేషనుకు వెళ్ళితివనుకొనుము. బండినుండి అనే కులు దిగుచుండగా, వారందరిమీద దృష్టిని నిలుపుచు "ఆయ నెంత బాగున్నాడు! ఆమెంత బాగున్నది!" అని అనుకొనుచు ఇట్లు కనబడిన వారందరిని నీవు చూచుచుండగా ఎవరికొరకు స్టేషనుకు వెళ్ళితివో వారు చల్లగా దాటిపోవుదురు. అతడు రాలే దేమోయని నీవు ఇంటికి వెళ్ళగా నీకంటె ముందేవచ్చి నీ స్నేహి తుడు ఇంటిలోనే కూర్చుండును. "ఇదేమిటండి రెండుగంటల నేను స్టేషనులో మీకొరకు చూస్తూ, వెదకుచు మీరు కనబడకుంటే తిరిగి వచ్చేశాను. మీరేమో ఇక్కడున్నారు. ఏలాగొచ్చారు? అని ప్రశ్నించగా, నీ స్నేహితుడు: "స్టేషను దగ్గర నిన్ను చూచాను; నీవు ఇటు అటుపోయె ఇతర ప్రయాణికులనే చూచుచు వారినే పొగడుచుంటివి. అందునుబట్టి నన్ను చూడలేకపోతివి" అని ప్రత్యుత్తర మిచ్చెను.

మన పొరపాటును అట్లేఉన్నది. మనతోపనిలేని మనుష్యు లను వస్తువులను చూచుచు సమయమంతయు వృథాపరచు వార

మైనందున మన జీవితములు నిష్ఫలితములైనవి. అపొస్తలుడైన యోహాను వంటివాడే మోసపోయిన యెడల మనము ఏపాటివారము? మన ప్రభువు యోహానును ప్రేమించెను అతనికి చూపుటకును, ఇచ్చుటకును ఎన్నో విషయములు ఆయన కలిగియుండెను. ప్రకటన గ్రంథములో నీవు చూచునన్ని మర్మములు మరెందును లేవు. ముసలివాడై చెరలో మిక్కిలి అధైర్యస్థితియందుండగా ఇవన్నియు యోహానుకు చూపబడినవి. అయితే అప్పుడు యోహాను చూచినవి మరెవరును చూచియుండలేదు. పరలోకమునంతయు, తనరాజ్యమునంతయు అతనికి ప్రభువు చూపగలిగెను. ఈ భాగ్యము మనకు కూడ చెందు చున్నది. ఈ మర్మములు ఇప్పుడు మనకు కూడ వెల్లడిచేయబడునని మన ప్రభువే మత్తయి 13:17 లో చెప్పుచున్నారు. చూచుటకుకళ్ళు వినుటకు చెవులు గలవారికి (1 కొరింథీ. 2:9,10) వచనములలో చెప్పిన ప్రకారం "కంటికి కనబడనివి, చెవికివినబడనివి, మనుష్యహృదయమునకు గోచెరముకానివి" ప్రత్యక్షపరచబడుచున్నవి. అయితే మనము గమనించవలసిన విషయమేమనగా మనకు కండ్లున్నవి గాని మోసపరచబడి నానా విధములుగా ఆకర్షింపబడుచున్నవి. నిన్ను అతివిస్తారముగా ఆకర్షించునది ఏది? నీవు, నీ భార్య, చిన్న కుమారుడు బజారువీధిలో నడుచుచుంటిరని భావించుము. అనేక విధములైన కొట్లు వచ్చును. మిఠాయి దుకాణము గాని ఆట వస్తువుల దుకాణముగాని వచ్చినప్పుడు, "నాన్నా, నాన్నా" అని బాలుడు నిన్ను పిలిచి, ఒక మిఠాయినో లేక ఒక ఆటవస్తువునో చూపుచున్నాడు. తినువాటియందును, ఆడుకొనువాటియందు మాత్రమే పిల్లవానియొక్క అభిరుచి. బట్టల దుకాణము వచ్చినప్పుడు "ఆ చీర ఎంత సొగసుగా నున్నదో చూడండి" అని నీ

భార్య నిన్ను పిలిచి చెప్పుచున్నది. మనము ఏది ఎక్కువ ఇష్ట పడుచున్నామో దాని వలన మనము ఆకర్షింపబడుచున్నాము. ప్రభువువలన మాత్రమే ఆకర్షింపబడునట్టి కండ్లు ఆయన నీకిచ్చి యున్నాడని చెప్పగలవా? లేని యెడల కీర్తనలగ్రంథకర్త 119:18 లో ప్రార్థించినట్లు 'నాకన్నులు తెరువుము" అని ప్రార్థించుము.

చాల సంవత్సరముల క్రిందట నేను లివర్‌పూల్ నుండి కెనడాకు ఓడలో ప్రయాణము చేయుచుంటిని. ఆఓడలో క్రొత్తగా వివాహము చేసికొనిన దంపతులు కూడ ప్రయాణము చేయు చుండిరి. వారు ఇతరులకు దూరముగా ఒకరినొకరు విడువకయుండిరి, ఒకరిలో నొకరు ఎంతగా నిమగ్నులైయుండి రనగా చుట్టు ప్రక్కల నున్న వారినెవరిని కన్నెత్తి చూడనైనా చూడరైరి. ఒండొరుల మీదనే వారి దృష్టి నిలిపి యుండిరి, ఈ విధముగా మనదృష్టి ఇతరమైన వాటిచేత ఆకర్షింపబడక తన మీదనే నిలిచి యుండవలెనని మన ప్రభువు యొక్క కోరిక.

అపొస్తలుడైన యోహానుయొక్క కండ్లను ప్రభువు తెరువగా అతడేమి చూచెను? ఏమి వినెను? ఏమి చేసెను? ఈ విషయములే ఇటు తరువాత మనము ఆలోచించబోవుచున్నాము. అంతలో నేను వేడునదేమనగా, చూచుటకు కండ్లనిమ్మని ప్రభువును అడుగుము. అప్పుడు నీవెన్నడు ఇదివరకు చూడని రీతిగా యేసునాథుని సౌందర్యమును మహిమను చూతువు. యేసువైపు చూడుము; చూచుచునేయుండుము. ఏ స్త్రీగాని, పురుషుడుగాని, మరి దేనిచేతనైనను నీ దృష్టిని ఆకర్షింపబడనీయక యేసువైపే చూచుచుండుము.

# 2

# చూచి వెంబడించుము

## యేసు-శాశ్వతమైన మిత్రుడు

యోహాను 1:26, 31,33 వచనములలో "నేను ఆయనను ఎరుగనైతిని" అని బాప్తిస్మమిచ్చు యోహాను మాటిమాటికి అనుచున్నాడు. ప్రభువైన యేసును మే మెరుగుదుమని సత్యముగను, సంతోషముగను చెప్పజాలక యోహానువలెనే నుండువారు అనేకులుండవచ్చును. వారు ఆయననుగూర్చి వినెదరు. ఆయననుగూర్చి పాడెదరు. ఆయననుగూర్చి మాటలాడెదరు గాని స్వంత రక్షకునిగాను, స్నేహితునిగాను ఆయనను ఎరుగరు. శాశ్వతముగా మనకు స్నేహితునిగా నుండుటకు ఆయన భూలోకమునకు వచ్చెను. భూలోకమిత్రులు మనతో సదాకాలముండలేరు. అయితే, మత్తయి 28:20లో ప్రభువు ఇట్లనుచున్నాడు. "ఇదిగో నేను సదాకాలము మీతో కూడ ఉన్నాను!" ఆయనయొక్క ఎడతెగని సాన్నిధ్యము అనుభవించవలెనని గోరువారికి ఈ మాటలు చెందుచున్నవి. నేను క్రైస్తవుడను కాకపూర్వము ఇట్టి అనుభవము లేనివాడనై యుండినను సజీవుడైన, నిజమైన స్నేహితుడు ఒకడుండెననియు, ఆయన మనతో సదాకాల ముండగలడనియు ఎరిగి యుంటిని. నేను సిక్కు మతములో నుండగా ప్రతిదినము ప్రాతఃకాల స్నానపువేళలో ఒక జపము వల్లించవలసి యుండెను శిరస్సుమీద నీరు పోసికొనగానే వాటియంతట అవే ఈ మాటలు నా నోటినుండి వచ్చుచుండెను : "ఓదేవా! నీవు సత్యవంతుడవు;

ప్రారంభము నుండియు సత్యవంతుడవు; ఇక మీదటకూడ సత్యవంతుడవే; ఎవ్వడును నిన్ను ఎరుగడు; యుగయుగములు ధ్యానించి సర్వలోకజ్ఞానము సంపాదించినను ఎరుగడు. ఓదేవా ! నాలో ఎట్టిసద్గుణములేదు. నీ కృపయే నా అధారము. నాకు తోడ్పడి, నన్ను నడిపింపగలిగిన ఆ స్నేహితుని, ఆ సద్గురువును, నాకు కనబరచుము". ఆ సజీవ మిత్రుని చూడవలెనను ఆశతో అనేక సంవత్సరములు ఈ మాటలు తిరిగి తిరిగి పలుకుచుంటిని. నదిఒడ్డున లేక ఏదో అడవి, లేక ఇంకేదో ఏకాంత స్థలమునకు వెళ్లెడివాడను. కారణమేమనగా పొడవైన తెల్లని గడ్డం గలిగిన ఒక ముసలివాడు ఒకడు నాకు కనబడి ప్రేమ లొల్కు స్వరముతో, "బిడ్డా, రమ్ము, నేను నీకు మిత్రుడను" అని చెప్పునని ఆశించితిని. నేను ప్రతిదినం అంధత్వముతో వల్లించుచుండిన ప్రార్థనవలన ఆ సజీవుడైన మిత్రుని చూడవలెనను కాంక్ష నాకు మెండుగానుండెను. తుదకు పరిశుద్ధగ్రంథమగు బైబిలును దూషించి, దానిని ముక్కలు ముక్కలుగా చింపివేసితిని. క్రైస్తవ మతమంటె నాకంత ద్వేశముగానుండెను. అనేక చెడు అలవాట్లకు బానిసగా లోబడిపోతిని. ఇన్ని అక్రమములు చేసిన నావంటి పాపిని సహా దేవుడు వెదకి, కనుగొని నా పాపములను క్షమించెను. నిరాటంకముగా సంభాషించుటకును, సహాయము కొరకు ఆధారపడి యుండుటకును ఆయన నా మిత్రుడై నా ప్రతి అక్కరను తీర్చుచు ఇప్పటికి నలుబది నాలుగేండ్లయినవి.

నేను కాలేజీలో చదువుచుండిన కాలమందు నాకొక మంచి స్నేహితుడుండెను. మేమిరువురము కలిసి సాయంకాలములలో

విహారమునకై వెళ్లెడివారము. ఇద్దరము కూర్చుండి భోజనం చేసెడివారం. ఏమిచేసినను కలిసియే చేసెడివారం. ఎవరిదగ్గర పైసా యుండినను ఇరువురము దానిని పంచుకొనెదము. నేను ఏదికొనుటకు అంగడికి వెళ్లినను రెండేసికొనువాడను. అతని కొకటి, నాకొకటి. అతడు బజారుకు వెళ్లినచో అట్లేయును. అయితే ఒకనాడు కలహించుకొంటిమి. అదేగదియందు మేముం టిమిగాని ఎన్నో వారములవరకు ఒకరితో నొకరు మాట్లాడ కుంటిమి. ఇట్లుండికూడ రెండేసివస్తువులు కొనుట మానలేదు. అతని బల్లమీద నేను, నా బల్లమీద అతడు వస్తువులను పెట్టి వేయుదుము. నోటితో మాట్లాడకుండినను మనస్సులో స్నేహ భావము మారలేదు. అనగా పైకి విరోధముగా కనబడినను లోపల స్నేహితులమే. అన్నియు పంచుకొనవలసినదే. ప్రభువు యొక్క స్నేహము మనకు ఇంతకంటె ఎక్కువ ప్రియముగా నుండవలెనుగదా! మనవన్నియు ఆయనతో ఇంకెంతో కుతూహ లముతో పంచుకొనవలెను గదా!

## యేసు-దేవుని గొర్రెపిల్ల

యోహాను 15:15లో యేసునాధుడు ఇట్లనుచున్నాడు." నేను నా తండ్రివలన వినిన సంగతులన్నియు మీకు తెలియ జేసితిని." ఆ శిష్యులకు ఆ మాటలు అర్థం కాలేదు. ప్రభువు తిరిగిలేచి వారిహృదయములందు ప్రవేశించిన పిదపనే అమాటల అర్థం వారు గ్రహించిరి. వారు సాధారణమైన జాలరులైనను దైవిక సంగతులు గ్రహించగలిగిరి. పరిశుద్ధాత్మని ప్రేరేపణ వలన వీరు వ్రాసిన వ్రాతలద్వారా పరలోకజ్ఞానము అనేకులకు నేర్పబడుచున్నది. ఆ వ్రాతలను మనము ఎన్నిమారులు చదివి

నను విసుగులేదు. తన శిష్యులవలె మనం కూడ సమస్తజ్ఞానం ఆయననుండి పొందవలెననియు, అంతకంతకు విస్తారంగా ఆయనను మనం తెలిసికొనవలెననియు ప్రభువు ప్రేమతో కోరుచున్నాడు.

బాప్తిస్మమిచ్చు యోహానును ప్రభువు యెట్లు ప్రత్యక్ష పరచుకొనెనో చూతము. అతడు పరిశుద్ధాత్మతో నింపబడినవాడై ఎంతశక్తితో మాట్లాడుచుండెననగా, అతడు అరణ్యములోనుండినను, ఆ అరణ్యమునకే అనేకులు పరుగెత్తిపోయి వినుచుండిరి. ఈనాటి ఉపన్యాసకులు, బోధకులు మనుష్యులను తమయొద్దకు ఆకర్షించుకొనుటకు నానాసాధనములు ఉపయోగింతురు. బాప్తిస్మమిచ్చు యోహానైతే అడవిలో నివసించువాడు. అతడు అరణ్యంలోని ఒక స్వరం మాత్రమే. అయినను అక్కడకే వెళ్లి అనేకులు అతని మాటలు వినుచుండిరి. ఒకానొక దినమున ఆ సమూహముతో మన ప్రభువే యోహానునొద్దకు వచ్చెను. బాప్తిస్మమిచ్చు యోహాను ఆయనను చూచెనేగాని ఎవరో అనుకొనెను. అతడు యిట్లు చెప్పెను. “మీ మధ్య ఉన్నాడు; మీరాయన నెరుగరు” (యోహాను 1:26). “నేను ఆయనను యెరుగనైతిని” (వ.33). ఏ దినమైతే పరిశుద్ధాత్మ ప్రభువైన యేసుక్రీస్తు మీద దిగి నిలిచెనో అప్పుడు యేసును తెలిసికొని యోహానుయిట్లనెను. “ఆత్మ పావురమువలె ఆకాశమునుండి దిగివచ్చుటచూచితిని, ఆ ఆత్మ ఆయనమీద నిలిచెను” (వ.32). “ఈయనే దేవుని కుమారుడని నేను తెలిసికొని సాక్ష్యమిచ్చితిని” (వ. 34). ఆ దినమునకు పూర్వము యెన్నిమారులు మన ప్రభువు బాప్తిస్మమిచ్చు యోహాను కడకు వెళ్ళియుండెనో చెప్పజాలము. ఈ సమూహములలో యేసు యుండెనని యోహానుకు తెలిసియుండెను. అయినను అందులోఆయన యెవరనిగుర్తించలేకుండెను. మెస్సీయాను

చూడవలెనను కోరికవలన చాలకాలము అతడు ఆయనకొరకు కనిపెట్టియుండెను. దేవుడు స్పష్టంగా అతనితో యిట్లుచెప్పెను: "పరిశుద్ధాత్మ పావురమువలె ఆయన మీద దిగినప్పుడే ఆయన యెవరని నీవు తెలిసికొందువు". యోహాను ఒక ప్రవక్తయైనను ఆ సమూహంలోనే యుండిన యేసు ప్రభువును యెరుగలేకుండెను. "నేను ఆయనను యెరుగనైతిని" అని పలుమార్లు ఒప్పుకొనెను. జనసమూహంలో యేసుప్రభువు వుండినను ఆయన సన్నిధిని గుర్తించలేదు. అలాగే నీవు హాజరైన కూడికలో యేసు ప్రభువు వుండినను ఆయన సన్నిధిని నీవుయెరుగకపోవచ్చును.

అయితే యేసు బాప్తిస్మముపొందిన దినమున జరిగినది ఏమి? (మత్తయి 3:16 చూడుము) బాప్తిస్మమిచ్చు యోహాను యేసుప్రభువును గుర్తించుటకు ముందుగా దేవునివాక్య ప్రకారము ప్రభువు బాప్తిస్మము పొందుట అవశ్యకమై యుండెను. ఏలనగా, ఆయనయొక్క మరణ, భూస్థాపన, పునరుత్థానములకు బాప్తిస్మము సూచనగా నుండెను. ఆయనచేయు అద్భుత కార్యములవలన కాదు గాని ఆయన బాప్తిస్మమును, పరిశుద్ధాత్మ ఆయనమీద దిగుటనుబట్టియే ఈయనే ప్రభువని గుర్తింపబడ వలసి యుండెను,

అటు పిమ్మట ప్రభువుకు యేమి సంభవింపనైయున్నదో అను విషయము బాప్తిస్మమిచ్చిన తరువాతియే యోహాను ప్రవచించెను. మరునాడు ప్రభువు అతనికడకు వచ్చుచుండుటచూచి ఆయనను ఒక క్రొత్తపేరుతో యిట్లు సూచించెను. "యిదిగో లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల." ఆ దినములలో మెస్సీయ వచ్చుచున్నాడని యూదులు ఆశతో కనిపెట్టుచుండినను "ఇదిగో మీ రక్షకుడు" లేక "ఇదిగో మీ మెస్సీయా"

ఆయనేగాని తెలుపలేదు. ప్రారంభమందు వచ్చిన సమూహమందు ఆయన వుండినను ఆయనను యెరుగనైతినని నెను. ఇప్పుడైతే ''ఆయనను యెరుగుదును'' అని చెప్పెను. "దేవుని గొఱ్ఱెపిల్ల" యని ఆయనను తెలుపగలిగెను. ఏపేటావేలాది వేలుగా గొఱ్ఱెపిల్లలను, వధించి దాని అర్థము తెలియక యూదులు పస్కా పండుగను ఆచరించుచుండిరని యోహాను యెరుగును. అయితే ఆ దయమే అతడు గ్రహింప నారంభించినది ఏమనగా, యేసే ''దేవుని గొఱ్ఱెపిల్ల" యని. ఇతర గొఱ్ఱెపిల్లలు నరుల పాపమును-మోసికొని పోజాలవనియు, సర్వలోక పాపమును హరింపజేయ శక్తిగల గొఱ్ఱెపిల్ల ఈయనేయనియు యోహాను యిప్పుడుచూచెను.

నీవు యెన్నికార్యములు చేసినను, యెంత కన్నీరు కార్చినను, యెంతకాలము ఉపవాసముండినను, యెంత ధర్మము చేసినను, యెన్ని కూటములకు హాజరైనను నీ పాపము క్షమించబడెనను నమ్మకము వీటిలో దేనిద్వారానైనను నీకు కలుగదు. బాప్తిస్మమునకు వచ్చినవారి సమూహములను చూతుము. యెంత ఆశతో ఈ జనసమూహము బాప్తిస్మమిచ్చు యోహానుకడకు వచ్చిరి. ఇతడొక దైవజనుడని వినియుండిరి. ధనికులేగాని, దరిద్రులేగాని అతని మాటలకు గజగజ వణకుచుండిరి. పాపులకు ఒప్పుదల కలిగెను. కన్నీళ్ళతో పాపమును ఒప్పుకొనిరి. వారిలో యెవరినో నీవిట్లు ప్రశ్నించితివి అని భావించుము. ,,మీరు కన్నీరు కార్చుకొంటూ పాపాలన్ని ఒప్పుకొంటిరే అని క్షమించివేయబడినవా?" వారి జవాబు యిట్లుండును. ,,లేదు. మనస్సాక్షి యింకా నేరముక్రిందనే యున్నది." నేరము క్రింద మనస్సాక్షి యుండుట చాలా భయంకరము. కొంతకాలము వరకు నీ మనస్సాక్షిని అణచిపెట్టగలవేమో! "ఇందులో యేమి

తప్పుండి? ఇంత బెదరు నా కెందుకు? ఈ పని నేనొక్కణ్ణే చేస్తున్నానా? ఇంకెవ్వరు చెయ్యటములేదా?" ఇట్లు వాదించుచు కొంత కాలము జరుగునుగాని, తిరిగి నీ మనస్సాక్షి నిన్ను బాధించుట మొదలిడును. నీవు శాంతి యెరుగకుందువు. చేపను నీటినుండి తీసి పైన వేసినచో యెట్లుకొట్టుకలాడునో నీగతి అట్లేయుండును. నీటిలో నున్నతసేపు చేప చక్కగా ఈదులాడును. బయట పడినచో గిజగిజలాడును, యెగురుచుండును. మంచి మనస్సాక్షిలేని వారందరి స్థితి యిదే. వారికి సమాధానముండదు. బాప్తిస్మమిచ్చు యోహాను కడకు వెళ్లినవారు యెట్టివారనగా తమ పాపములను ఇతనిదగ్గర ఒప్పుకొనికూడ లాభములేకుండెను. ఏలయనగా, పాపములు క్షమించు శక్తి బాప్తిస్మమిచ్చు యోహానుకు లేదు. పాపక్షమాపణ నొసగునట్టి మెస్సీయా వచ్చుచున్నాడను వార్తను వారికి చెప్పెను.

మెస్సీయానుగూర్చి యూదులకొరక తప్పు అభిప్రాయముండెను. దావీదురాజు రాజ్యమేలినరీతిగా సమస్త జనులమీద ఈయన రాజ్యమేలునని తలంచిరి. బాప్తిస్మమిచ్చు యోహానుకు సహితము అట్టి అభిప్రాయముండెనేమో; ఎట్లయినను యూదులందరు మెస్సీయ రాకకొరకు ఎదురు చూచుచుండిరి. ఇప్పుడు బాప్తిస్మమిచ్చు యోహానుకు ఒక క్రొత్తరీతిగా దేవుడు మెస్సీయాను ప్రత్యక్ష పరచుచున్నాడు. యేసుక్రీస్తు మీద పరిశుద్ధాత్మ దిగుట చూచినప్పుడే ఈయన దేవుని కుమారుడని తెలిసికొనెను. ఇది మొదటి మెట్టు. పిమ్మట అయనను ప్రకటించుచున్నాడు: "ఇదిగో, దేవుని గొఱ్ఱెపిల్ల" (యోహాను 1:29,36). ఇది రెండవ మెట్టు. నీకు కంటి అద్దాలు కావలెనంటే కంటిని పరీక్షించి అద్దాలు ఇచ్చువాని కడకు వెళ్లుదువు. "ఆ అట్టమీద ఉన్న అక్షరాలను చూడగలవా?" అనుచు ప్రారంభించును. "చూడలేవు".

అప్పుడు ఇంకొక అద్దము నీ కంటికిపెట్టి పరీక్షించును." మును పటికంటె కొంత కనపడుతుంది" అందువు. ఆ అద్దము తీసివేసి మరొకటి పెట్టును. "ఇప్పుడు చక్కగా కనబడుతుంది". ఇట్లే బాప్తిస్మమిచ్చు యోహాను దృష్టి ప్రభువైన యేసు క్రీస్తు విషయం పెట్టు పెట్టుగా అంతకంతకు స్పష్టమాయెను.

యోహాను ప్రభువుకు బాప్తిస్మమిచ్చినప్పుడే మొదటి సారిగా ఆయనను గుర్తించెనుగాని ప్రభువు విషయము ఏమి చెప్పక ఊరకుండెను. మరునాడు తనవైపు ఆయన వచ్చు చుండుట చూచి, "ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల" అని ప్రకటించెను. మూడవ దినమున ప్రభువు ఆ మార్గమునుదాటి పోవుచుండగా, "ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల" అని అరచెను. ఆత్మీయంగా ఇదే రీతిని ఒకే దినమందు నీవు సమస్తమును చూడజాలవు. ఆయన ఉన్నది ఉన్నట్టుగానే నీవు ఆయనను చూడవలెనంటే దేవుడు నిన్ను అనేకమారులు తాకవలసియుండును.

## ఆయనను చూచి వెంబడించుము

"ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల" అని యోహాను తనకుతానె మొదటి సారి పలికెను. మరునటిసారి "అంద్రెయా, నీవు కూడ ఆయనను చూడుము" అను చున్నాడు. తన అనుభవము ఎట్లు పెరుగు చున్నదో గమనించుము. ఇతరులుకూడ ఆయనను చూడవలెనని ఇప్పుడు అతని కోరిక. యేసు దేవుని గొఱ్ఱెపిల్ల యని యోహాను చెప్పటనుబట్టి ఆయనను తాము చూడవలెనను కోరిక అతని శిష్యులకు కలిగెను, వారు మనస్సులో ఇట్లు తల పోయుచున్నారు: "దేవుని గొఱ్ఱెపిల్లనా; ఆయనను వెంబడింతము రండి" ఇక యోహానును విడిచి ఆయన వెంటబడిరి. ప్రభువు వెనుకకు తిరిగి "మీరేమి వెదుకుచున్నారు?" అనెను. తనను

నీవు స్పష్టముగా చూడవలెనని వచ్చుచుండిరని ఆయనకు తెలియక పోలేదు. ఆయన వెంబడినీవు వెళ్ళినచో నిన్ను కూడ వెనుకకు తిరిగి చూచి: "బిడ్డా నీకేమి కావలెను?" అని యడుగును. నీవైతే ఒక ఉద్యోగమిమ్మనిగాని, శరీరస్వస్థతగాని అడుగుదువేమో ఆ శిష్యులకు అవన్నియు లక్ష్యముకాదు. "రబ్బీ, నీవు ఎక్కడ కాపురమున్నావు?" అని అడిగిరి. ప్రభువైన యేసు క్రీస్తును చూచిన వారికి ఈ విషయము ఎక్కువ ఆశగా నుండును ...."నా ప్రభువు ఎక్కడ? అయన కాపురముండునది ఎక్కడ? ఆయన ఎక్కడ నివసించుచున్నాడో తెలిసికొనుటకు నీవు ఆశించుచున్నావా?

సజీవుడైన క్రీస్తును అనేకులు సమాధుల దొడ్డిలో వెదుకుచున్నారు. "సజీవుడైనవానిని మీరెందుకు మృతులలోవెదకుచున్నారు?" మనుష్యులు నిర్మించిన కట్టడంలలో ఆయనను వెదుకుచున్నారు. వాస్తవంగానీవు వెదకినయెడల ఆయనను కనుగొందువు నీయజమానుడు ఎక్కడ నివసించునో ఎరుగుదువా? మొదట నీ హృదయమందే వసింప ఆయన కోరుచున్నాడు, మనుష్యులు కట్టించు ఏ కట్టడమును ఆయనకు అవసరములేదు. ''దేవుని మందిరము అనబడుదానిని యేసుక్రీస్తు నామమున కట్టించుచున్నామని ఎందరెందరు ఆ కట్టడముకొరకు ముష్టి ఎత్తుటలేదు? ''దేవుని మందిరము కట్టించబోతున్నాము. కొంత దబ్బు సహాయము చేయండి" అని వారనెదరు. దేవుని మందిరము యొక్క అర్థము కూడ అట్టివారికి తెలియదు. దేవుడు రెండే స్థలములలో నివసించును: ఉన్నతమైన పరిశుద్ధ స్థలములందు, విరిగి నలిగిన దీనహృదయమునందును (యెషయా 57:15).

నీ హృదయమందు యేసుక్రీస్తు వసింపవచ్చి యున్నాడా? నీ సజీవ మిత్రుడాయెనా నీ పాపమును క్షమించి, నిన్ను శుద్ధిక

రించి, నీ హృదయమును తన నివాస స్థలముగా ఏర్పరచుకొను నిమిత్తము ఆయన మరణించెను. ఈ ఉద్దేశముతోనే నిన్ను వెదుకుచున్నాడు. నీ పాపము విషయము పశ్చాత్తాపపడి, ఆయనను అంగీకరించితివేని ఆయన నీ హృదయములోనికి వచ్చి నివసించును.

నీ హృదయమును ఆయనకిమ్ము. అటు పిమ్మట నీ దృష్టిని ఆయన మీద నిలుపుము. ఆయనను వెంబడించుము; అప్పుడు అంతకంతకు ఎక్కువగా తనను నీకు ప్రత్యక్షపరచుకొనును.

**

# 3

## చూచి శోభించుము

### యేసువైపు చూచుచు

1947వ సంవత్సరమున యుద్ధ భూమినుండి తిరిగి వచ్చుచుండిన 1,500 మంది యోధులను ఒక ఓడ తీసుకొని వచ్చెను. ఆ ఓడ సౌథాంప్టన్ చేరగా ఈ యోధుల బంధుమిత్రాదులు అనేకులు తమ ప్రియులను ఆహ్వానించుటకు నౌకాశ్రయమునకు వచ్చిరి. యుద్ధము వచ్చినందున తననుండి ఎడబాటు చేయబడిన తన యువకుని కలిసి కొనుటకు ఒక యువతి కూడ అచ్చటికి వచ్చియుండెను. ఈ ఇరువురి పరస్పర విశ్వాసము ఎంతటి దనగా యుద్ధమున్నను, లేకున్నను ఒండొరులయెడల వారు కలిగియుండిన నమ్మకమును మార్చుటకు ఎవరితరమును కాకుండెను. నౌకలు నిలుచుండు స్థలము నొద్ద ఆమె అటునిటు తిరుగుచు తన వరుని కొరకు చూచుచు, ఆతురతతో వెదకు

చుండెను. అందరు ఒకే విధముగా యోధుల దుస్తులు ధరించి యుండినందున అంత పెద్ద సముహముండు తన ప్రియుడెవరో గుర్తింపగలుగునా? ఆ యుద్ధభటులు ఆమెను హేళన చేయ నారంభించిరి. "నీ ప్రియుడు పోర్ట్ సయ్యద్ దగ్గరనే దిగిపో యాడు" అని ఒకడు ఆమెతో చెప్పెను. "నేను ఏడెన్ దగ్గర అతని చూచితిని. ఇప్పుడెక్కడున్నాడో నాకు తెలియదు. ఇట్లు మరొకడు అనెను. "నేను అతని కైరోలో చూచితిని. అక్కడే ఉండిపోయాడేమో" అని మూడవ వాడు పలికెను. వారి మాటలను ఆమె ఏ మాత్రము లక్ష్యపెట్టలేదు తన ప్రియుడు ఆమెకు ఉత్తరము వ్రాసి యుండినందున ఆ ఓడలోనే ఎక్కడో అతడుండి తీరవలెనని ఆమె ఎరుగును. ఇంతలో తన ప్రియుడు ఈలవేసెను. వెంటనే "ఇదిగో ఆ ఈల అతనిదే. అదిగో అక్కడున్నాడు. అక్కడున్నాడు" అని అత్యానంద ముతో అతనిని గుర్తించెను దాదాపు వేయి కండ్లు ఆమె దృష్టిని మరల్చ యత్నించుచుండెనే గాని లాభము లేకపోయెను, అదే విధముగా ఒక్కమారు మనము అనుభవపూర్వకముగా మన ప్రభువును తెలిసికొంటిమేని ఏ పురుషుడైనను, ఏ స్త్రీయైనను ఆయనయందు మన దృష్టిని మరల్చలేదు.

ఆయన నామము నిమిత్తము తీవ్రమైన హింసలు, దూష ణలు, హేళనలు మనము అనుభవించవలసి యుండెనను, మన దృష్టి మన ప్రభువుపైననే నిలిపియుంచవలె ననియే ఈ దినము లలో మన కోరికయై యున్నది మన స్వంత తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు, పొరుగువారే మనలను ద్వేషింతురు. ఇవన్నియు రేపో మాపో మనకు సంభవింపవచ్చును. విశ్వాసు లైన అనేక స్త్రీ పురుషులు డబ్బును చూచి లేక ఒక పదవిని చూచి ఆకర్షింపబడుచున్నారు. వారు మన ప్రభువును ఒప్పుకొన

రైరి. అయితే మన ప్రభువు మనలను ప్రేమించుచున్నాడు. తిరిగి ఇట్లనుచున్నాడు. ''నావైపు చూడండి", "భూదిగంతనివాసులారా నావైపు చూచి రక్షణ పొందుడి'' (యెషయా 45:22), ప్రేమ పూర్వకమైన ఆహ్వానము! మన ప్రభువు మనందరితోను ఇట్లనుచున్నాడు "నీ కెటువంటి కష్టము, పరీక్ష, శోధనకలిగిన ప్పటికిని, నావైపు చూడుము'' అదియే విజయమునకు రహస్యము.

## చూచి శోభించుము

కీర్తనలు 34:5 లో 'వారు ఆయన తట్టుచూడగా వారికి వెలుగు కలిగెను'' అని మనము చదువుచున్నాము. దీని అర్థము ఆయన తట్టుచూడగా వారి ముఖములు సంతోషముతో ప్రకాశించుచుండెను. ఆయన యొద్దకు రాకపూర్వము ఎట్లుండెను? ఆ ముఖముల మీద భయమును, పాపపు మరియు అవమానపు మరకలే కనబడెను, పాపపూరితమైన ప్రతి తలంపు, మాట, క్రియకూడ దాని అసహ్యమైన, సిగ్గుకరమైన గుర్తును ముఖం మీద వేయును. ప్రారంభమందు ఈ గుర్తును మనం చూడక పోయినను, అటువెనుక అది ప్రత్యక్షమగును. ఇచ్చట- "వారు ఆయనవైపు చూడగా వారి ముఖములు ప్రకాశించె''నని దేవుడు చెప్పుచున్నాడు, ఈ ప్రజలుఎవరు? ఎవరైతే ఒకప్పుడు పాపము వలన నలుపెక్కి, అవమానం వల్ల వికారంగా ముద్రింపబడిన ముఖములు కలిగియుంగిరో, వారే వీరు. ఆయనతట్టు ఎప్పుడు చూచిరో అప్పుడు వారిముఖములు ప్రకాశించెను. తేజస్సుపొందిరి. ఒక క్రొత్త పరమ సౌందర్యంతో ఆ ముఖములు వికసించెను.

అదే కీర్తన 4, 6, 17, 19 వచనములద్వారా కీర్తనల గ్రంథకర్త అనేకమైన శ్రమలలోనుండి వెళ్ళినట్టుగా గ్రహించు

చున్నాము. అయితే అతడు ప్రభువు యొద్దకువచ్చి ఆయనను చూడగా అతని భీతియంతయు వదలిపోయెను. కష్టములు శ్రమలన్నియు మాయమైపోయెను. మీ కష్టములను మాతో చెప్పుకొనుటకు మీకు సమయం ఉండినయెడల మీరిట్లందురుకదా; "బ్రదర్, 5 లేక 6 గంటలు నాకు దయచేశారంటే, ఉన్నదంతా మీతో చెప్పేస్తాను". కొంతమంది శ్రమలనేకములు, భారములు బరువైనవి. కావున గంటలే కాదు. వారములు, మాసములుకూడ వారికి కావలసియుండును. కాని, వినుము, మాతో చెప్పవద్దు. పొరుగువారికిగాని, బోధకులకుగాని, ఎవరికిగాని చెప్పవద్దు. మీకు సహాయం చేయుటకు వారికి మనస్సుండినను చేయుటకు అసక్తులైయుందరు. ఈ దైవజనుడు తన స్నేహితులను నమ్ముకొనెను. అయితే వారు అపనమ్మకస్థులైరి. దావీదును ఎక్కువగా ప్రేమించిన స్నేహితుడు, రాకుమారుడగు యోనాతానుండెను. కాని, ఇతడు ఎంతగా ప్రయత్నించినను దావీదుకు సహాయం చేయలేకపోయెను. దావీదు ఇతర రాజులయొద్దకు వెళ్ళెను గాని, ఒకరైనను అతనికి సహాయం చేయలేకపోయిరి. మనకతడు "యెహోవాయొద్ద విచారణ" చేసెనని చెప్పుచున్నాడు. అనగా అతడు ప్రభువుతట్టు చూచెను. నానావిధములైనవారు తాము పడుచున్న కష్టములవలన అదుల్లాము గుహలో దాగియున్న దావీదునొద్దకు వచ్చి చేరిరి (1 సమూయేలు 22:2). వారువచ్చినప్పుడు తమ తమ పురాణములను దావీదు చెవిలో ఎట్లు నేసిరో మనం ఊహించవచ్చును. అవి ఎంతెంత పొడుగాటి కథలో నా భార్య నన్ను బ్రతుకనివ్వడములేదు" అని ఒకడు ప్రారంభించియుండెను. "నా స్నేహితులు నన్ను నానా కష్టాలు పెట్టుచున్నారు" అని ఇంకొకడు: మరికొందరు తమ అప్పులవాండ్లు లేక పొరుగువారు పెట్టుచున్న హింసనుగూర్చి చెప్పుకొని

యుందురు. అయితే ఒకనాటి ఉదయం వారు లేచినప్పుడు దావీదు ముఖము చూడగా అది ప్రకాశించుచుండెను. ఆ దినమును కొంత ఊహించుకొనుము. "సహోదరుడా దావీదూ, నీకేమి జరిగినది? రాత్రి మాతోబాటు కన్నీళ్ళు కార్చుచుంటివి. ఎంతో బాధపడుచుంటివి. తెల్లవారేటప్పటికి నీ ముఖమింత మారిపోయినది? నీ ముఖంలో ఇంత కాంతి, ఇంత తేజస్సు ఏలాగు వచ్చినది? చెప్పండి" ఇట్లు వారు అనుచున్నారు. దావీదు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చి యుండవచ్చును? "నా బాధలు, నా హింసలు, నా పరీక్షలు అన్ని ఎగిరిపోయినవి. ప్రభువు నాకు సహాయం చేసినాడు. నా భయమంతా తొలగించినాడు". ఇంకను ఆ గుహలోనే యున్నాడు. ఇంకను ఆ కష్టంలోనే యున్నాడు. ఇంతను అతని ప్రాణం తీయుటకు సౌలు వెంటాడుచున్నాడు. అయిననేమి? విశ్వాసం ద్వారా "నేను యెహోవాయొద్ద విచారణచేయగా ఆయన నాకు ఉత్తరమిచ్చెను. నాకుకలిగిన భయములన్నింటిలోనుండి ఆయన నన్ను తప్పించెను" అని దావీదు చెప్పుచున్నాడు. నిన్ను కూడ ఇట్లే తప్పించును.

ఒక మౌల్వీయొద్దకు ఒకడు వెళ్లెను. మౌల్వీ అనగా మహమ్మదీయుల మతగురువు. అతడు ఆ గురువుతో ఇట్లనెను: నా ముఖము కాంతిగా ఉండాలని నా కిష్టము. నేనేమి చేస్తే నా ముఖానికి కాంతి వస్తుందో దయచేసి చెప్పతారా?" "నేను ఒక జపము నీకు చెప్పుతాను: దానిని కంఠస్థము చేసి రోజుకు ఇరవై మార్లు చొప్పున ఇరవై ఒక్క రోజులు నీవు దాన్నివల్లించాలి. మూడు వారాలు గడచిన తరువాత నీ ముఖము ప్రకాశిస్తుంది" అని మౌల్వీ చెప్పెను. మరియు ఆ జపము వళ్ళించేముందు ముఖము, చేతులు కడుగుకొనవలెనని బోధించెను. ఇదంతయు ఈమనుష్య

ని మోసగించి, అతని దగ్గర డబ్బు లాగవలెనని ఈ గురువు చేసిన పన్నుగడ. "చాల చలిగా ఉన్నప్పుడు మొఖంమీద నీళ్లువేసి కడగడం ఎలాగు?" "నీళ్ళలో కడగడం కష్టమైతే, మట్టిగాని ఇసుకగాని తీసి మొఖంమీద చేతులమీద రాచుకో" అని గురువు గారు సెలవిచ్చిరి. ఇంక అదినమునుండి వీనికి అదేపని. ఇరువది రెండవనాటి ఉదయము వచ్చెను. వెందలకడనే లేచి జపం చేయబోయి, చలి అధికంగా నుండినందున నీళ్ళతో ముఖం చేతులు కడుగుకొనజాలక కొంతమట్టి తీయుటకై వెలుపలికి పోయెను. ఇంకను చిమ్మచీకటిగా నున్నందున చేతికికొంత మసి దొరకగా అదే మట్టియని తలచి, ముఖమును చేతులను దానితో తోముకొనెను. పిమ్మట జపము వల్లించెను. అటువెనుక వెళ్ళి భార్యనులేపి, ప్రియా, ఇప్పుడు నా ముఖంమీద తేజస్సున్నదా? చెప్పు అని అడిగెను. ఆవిడ మేలుకొని చూడగా, అతని ముఖమంతయు నలుపుగా నుండుటగాంచి "తేజస్సున్నది" అని ఆవిడ ప్రత్యుత్తరమిచ్చెను. అనేకమంది క్రైస్తవులు వేళ తప్పకుండ ప్రార్థనచేయుదురు. కూటములకు హాజరగుదురు. "కమ్యూనియన్ సర్వీస్" అని వారు పిలిచెడు ప్రభుబల్ల సంస్కారములో పాలు పొందుదురు. ముఖములు చూచినయెడల అవమానపు గుర్తులతో నిండియున్న మాడిపోయిన ముఖములే. నిజమే, యేసుక్రీస్తు నామముననే పిలవబడుచున్నారు. కాని ముఖముల మీద మట్టుకు అవమానపు మరకలే.

కీర్త. 34:5లో దావీదు తన నిజానుభవంతో ఈ రీతిగా పలుకుచున్నారు. "వారు ఆయనతట్టు చూడగా వారికి వెలుగు కలిగెను." సణుగుచు, గొణుగుచు దుఃఖించుచున్న ముఖములతో దావీదుకడకు వచ్చినవారు చీకటిగానున్న అదుల్లాము

గుహలో దావీదు ముఖము మెరయుచుండుటను చూచిరి. అప్పుడు వారుకూడ ప్రభువైపు చూచుటకు నేర్చుకొనిరి. వారి ముఖములు కూడ ప్రకాశింప మొదలిడెను, పేదరికముతోను, జబ్బులతోను వారుండినప్పటికిని దైవికతేజస్సు, సౌందర్యములతో వారి ముఖములు మెరయుచుండెను.

దేవుడనుగ్రహించినట్టి ఈ సౌందర్యము, సబ్బు వ్రాసి కొని, పౌడర్లు, క్రీములు పూసికొనుటవలనగాని, వెండి బంగారు ఆభరణములతో అలంకరించుకొనుటవలనగాని వచ్చుటలేదు. సౌందర్యం పొందుటకై వీటిని ఉపయోగించు వారి తెలివి తక్కువ ఎంతటిదో! లోకసంబంధమైన సాధనములు అవ మానకరమైన సాధనములు ఉపయోగించి అందగాండ్లగుటకు యత్నింతురు. కాని నిజంగా ఈ సాధనములతో ఉన్న రూప మునుకూడ వికారము చేసికొనుచున్నారు. మన భయములు మనలను విడిచి పెట్టినప్పుడే విశ్వాసం ద్వారా సకల పరీక్షలను మనము జయించినపుడే దేవుని మహిమతో మన ముఖములు కాంతిగలిగియుండును.

ఏ విధముగా ఈ ముఖకాంతి పొందగలమో అనుభవ పూర్వంగా నేర్చుకొనవలసినదే. "నిన్ను ఎరుగనని నే నెన్నడు బొంకను" అని పేతురు చెప్పెను. అయితే శోధన రాగా ప్రభు వును ఎరుగనని ముమ్మారు బొంకుటయే గాక మూడవమారు "ఇతన్ని నేనెన్నడు ఎరుగను,ఎన్నడు కలియలేదు, అతడెవ్వరో కూడ నేనెరుగను" అని శపించుచు ఒట్టుపెట్టుకొనుచు పేతురు బొంకెను. నిజమే, ఆ క్షణమున పేతురు గొప్ప చిక్కులో తగులుకొనియుండెను. అతనిచుట్టు మూగియుండినవారు యేసు ప్రభువునకు విరోధులైన దుష్టులు. ఆ కష్టమును మనము

ఊహించలేము. పేతురు ప్రభువుతో "నిన్ను ఎరుగనని, ఎన్నడు బొంకను" అని చెప్పియుండలేదా? మనలో అనేకులు కూడా ఈ రీతిగానే ప్రభువుతో చెప్పియు ఆయనను ఎరుగమందుము. కొందరు తమతో బైబిలుకూడ తీసుకొనివెళ్ళరు. అనేక కారణములు చెప్పుకొందురు. ఇరుగుపొరుగువారు ఏమనుకొంటారు? మా ఆఫీసర్లు ఏమంటారు. "ఓహో? వీరికికూడ చాలా భక్తి వచ్చేసింది. అనరా? ఇదే వారి భయం. ఒకవేళ బైబిలును తీసుకవెళ్ళినను కోటులోపలనో, ఎక్కడనో దాచియుంచుదురు. ప్రజలు ఏమనుకొందురో అని సిగ్గు. కొందరు ప్రభువు విషయం ఏ కొద్దిమాటలు చెప్పుకొనుటకైనా సిగ్గుపడుదురు. పేతురును ఖండించుట సులభమేగాని మనసంగతి ఏమి? ఎన్నిసార్లు పిరికివారమై ఆయనను ఒప్పుకొనుటలో తప్పిపోతిమి? ఎన్ని పర్యాయములు ఆయనను బొంకితిమి.

ప్రభువైన యేసుక్రీస్తు పేతురును ప్రేమించి, అక్కడికి ఒక కోడిని రప్పించెను. అది ఎట్లు వచ్చెనో మనం చెప్పజాలం. అయినను "నీవు నన్ను ఎరుగనని బొంకితివి" అని పేతురుకు తెలుపుటకు ప్రభువు ఒక దేవదూతకు ఆజ్ఞాపించలేదుగాని ఒక కోడిపుంజును ఉపయోగించుకొనెను. ఆయన ఆజ్ఞకు లోబడి ఈ పక్షి ''కొక్కొరకో....కొక్కొరోకో...."యని కూసెను అప్పుడు పేతురు ప్రభువును జ్ఞాపకము చేసికొనెను" ఆయనకు ఇష్టమైతే ఒక కోడిపుంజును కూడ ఉపయోగించగలడు; బోధలకుమీద ఆధారపడుటలేదు. కొందరుబోధకులు గంటలకొలది బోధింతురు గాని ఒక్కరైనను మారుమనస్సు పొందరు. అయితే ఇక్కడ కోడిపుంజు కూయగానే పేతురు హృదయం మెత్తబడెను. అతడు సంతాపపడి ఏడ్చెను.

పేతురు ప్రభువువైపు చూచెను. అతనికి పచ్చిసశోధనపై విజయమొందెను. ఇప్పుడు ప్రభువు "నా వైపు చూడుము" అని నీతో చెప్పుచున్నాడు. నీ పాపము లెట్టిపైనను నావైపు చూడుము. నీ పతనములెట్టివైనను నీ పాపములెంత అవమాన కరములైనను ఆయన ఈ మాటలు నీతో చెప్పుచున్నాడు. "నా వైపు చూడుము. నీబోధకులవైపు కాదు. నావైపు చూచి రక్షణ పొందుము."

ఎప్పుడైతే ఆయనవైపు చూతువో, నీవు పశ్చాత్తాపపడి కన్నీరు కార్చనారంభింతువు. దేవుని మందిరమందు కన్నీరు విడుచుటకు సిగ్గుపడు కొందరు ఇంటిలో ఏడ్చుచున్నారు. ఇండ్లలో భార్యలు ఏదో ఒకటి కావలెనని అడుగుచున్నారు. పురుషులు అది ఇవ్వనియెడల ఈ స్త్రీలు కండ్లలో తడిపెట్టుకొనుచున్నారు. నీ గృహమందు ఈ విషయము, ఆ విషయమునకై సునాయాసముగా నీవు కార్చు కన్నీరు దేవుని గృహమందు కార్చుటకు సిగ్గుపడుచున్నావు. ఈ దినమే నీపాపముల విషయమై దుఃఖపడుము.

నీ భయములు కష్టములు, శ్రమలు ఏమైయుండినను ఆయనవైపు చూడుమని ఈ దినమున ప్రభువు నిన్ను పిలుచుచున్నాడు. దావీదు ప్రభువుయొద్దకు కన్నీటితోను పశ్చాత్తాపముతోను, దుఃఖించుచువచ్చెను. తరువాత అతనిముఖంలో సంతోషముండెను. కీర్తనల గ్రంథకర్త ఈరీతిగా చెప్పుచున్నారు .... "వారు ఆయనతట్టు చూడగా వారికి వెలుగు కలిగెను''. వెంటనే వారి ముఖములు ప్రకాశించెను. అధికారముతో ఈ మాటలు మీతో చెప్పగలను : నిన్ను ప్రేమించి నీ కొరకు మరణించిన యేసువైపు చూచినచో ఇప్పుడే నీ శ్రమలు పరీక్షలు, కష్టములు

అదృశ్యమగును. గాయపరచబడిన తన పాదహస్తములను కనబరచుచు నీతో ఇట్లనుచున్నాడు. "నావైపు చూడుము. నిన్ను క్షమించుటకు, నిన్ను మార్చుటకు, నీ భయములు, శ్రమలు, పరీక్షలు తీసివేయుటకు నేనెంత బాధననుభవించితినో చూడుము."

నీవు నేడే ఆయనవైపు చూచిన యెడల నీ ముఖము శోభించును.

# 4

# చూచి ఆయనను పోలియుండుము

## మేము యేసుని చూడగోరుచున్నాము

"అయ్యా, మేము యేసుని చూడగోరుచున్నాము" (యోహాను 12:21). పస్కాపండుగలో యెహోవాను ఆరాధించుటకు యెరూషలేముకువచ్చిన హెల్లెనీయులలో కొందరు ఈ మాటలు పలికిరి. ఈ పండుగ యేసుక్రీస్తు మరణమునకు ముంగుర్తుగానుండెను. మరియు మెస్సీయ తమ పాపముల నిమిత్తమై ఏ విధంగా మరణించవలసియుండెనో ప్రజలది గ్రహించుటకు ఈ పండుగ నిర్ణయించబడియుండెను. ఈ పండుగను యూదులు శతాబ్దములకొలది ఆచరించుచు వచ్చిరి. కాని క్రైస్తవులు అనబడువారు ఎట్లయితే 'క్రిస్మస్' 'ఈస్టర్' పండుగల అర్థము ఎరుగక వాటిని ఆచరించుచున్నారో అట్లే యూదులు కూడ పస్కాపండుగను అర్థముతెలియక ఆచరించుచుండిరి. యేసుక్రీస్తునుగూర్చి వినిన ఈ హెల్లెనీయులు ఆయనను చూడగోరిరి. ఆయనచుట్టు జనసమూహములు మూగి యుండినందున ఫిలిప్పుద్వారా తమ మనవిని ఇట్లుపంపిరి— "అయ్యా, మేము

యేసును చూడగోరుచున్నాము. కొద్దినిమిషములే ఆయనను చూచుటకు'' దయతో మాకు సహాయముచేయుడి.'' ఫిలిప్పు అంద్రెయయొద్దకు వెళ్ళి అతనితో కలసి యేసుప్రభువు నొద్దకు పోయెను. ప్రభువు వారికిచ్చిన జవాబు బహు వింతగానుండెను. గోధుమగింజ భూమిలోపడి చావకుండినయెడల అది ఒంటిగానే యుండును'' అనిచెప్పెను (వచనము 24). ఆ జవాబు వింతగా నుండినను ఆయన పలికిన ప్రతిమాటయు కృపాసత్యములతోను లోతైన ఆత్మీయ అర్థముతోను నిండియుండెను. వింతయైన మాటలు పలికిన మహాబోధకులు అనేకులు ఉండియున్నారు. అయినను యేసుప్రభువుయొక్క మాటలే ప్రత్యేకమైనవి. అవి మరువరానివి. ప్రభువైన యేసుక్రీస్తుయొక్క మాటలను, బోధలను, గొప్ప గొప్ప గ్రంథకర్తలు అనేకులు విశదీకరించుచు అనేక గ్రంథములను వ్రాసియున్నారు. కాని ఎన్నిగ్రంథములు వ్రాసినను, అర్థమంతయుతీరిపోక ఇంకను ఊటగా ఊరుచున్నది.

ఆయన పలికిన ప్రతి మాటయు నొక యుద్దేశముతో చెప్పెను. అయితే ఈ మాటలు పలుకుటలో ఆయన యుద్దేశము ఏమైయుండెను? "గోధుమగింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును" దూరదేశము నుండి వచ్చిన ఈ మనుష్యులు యేసు ప్రభువును చూడవలెనని ఆతురత కలిగియుండిరి. వారి విషయము యేసుకు ఫిలిప్పు అంద్రెయులు సిఫారసు చేయుట సహజమే కదా? ఆయన వారి కిచ్చిన జవాబు చూడగా వారిని ఆయన లెక్క చేయలేదన్నట్లు కనబడుచున్నది. ఇట్టి మాటలు మన ప్రభువు ఏల పలికెను?

ఎఫెసీ. 3:20 లోని దైవ వాక్యప్రకారము "ఆయన మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయశక్తిగలవాడు" ఉదాహరణము—ఒకపాపి

ప్రభువైన యేసుక్రీస్తు కడకు వణకుచు వచ్చి, 'ప్రభువా, నన్ను క్షమించు, నా పాపముల విషయము చాలా దుఃఖిస్తున్నాను" అనును. అందుకు ప్రభువిచ్చు జవాబు= "బిడ్డా, నీపాపములు క్షమించడమే కాదు, నారాజ్యమంతా నికిస్తున్నాను నీఅక్కరలు ఏమైయున్నవో, అవి నాతో చెప్పి కావలసిన వన్నియు నా దగ్గర పొందుము." మనకున్న కష్టము ఏమనగా, ఎట్లు అడుగ వలెనో ఎరుగక యున్నాము. ప్రభువు యొక్క శిష్యులు మూడు సంవత్సరములు ఆయనతో నుండిరి. అయినప్పటికిని వారుకూడ ఇది ఎరుగకుండిరి ప్రభువు వారితో నిట్లు చెప్పెను "ఇదివరకు మీరేమియు నా పేరట అడుగలేదు. మీ సంతోషము పరిపూర్ణ మగునట్లు అడుగుడి, మీకు దొరుకును" (యోహాను 16:24). అనేక విషయములు ఆయన యొద్దనుండి అడిగిరని ఆయన శిష్యులు భావించుచుండిరి. ఒకానొకప్పుడు వారిలో సంతోషము పొంగుచుండగా ఆనందముతో తిరిగివచ్చి అయనతో ఇట్లు చెప్పు చున్నారు. ''నీ నామము పేరట మేమేది చెయగలిగితిమో చూడుము.'' దానికి ప్రభువు చెప్పిన దేమనగా, ''ఇదివరకు మీరేమియు నా పేరట అడగలేదు'' అనగా, తమ సంతోషమును పరిపూర్ణము చేయజాలనట్టి వాటినే ఆదివరకు వారు అడిగి యుండిరని భావము. గనుక ''ఇప్పుడు అడుగుడి, అడుగ నేర్చు కొనుడి'' అని ప్రభువు చెప్పుచున్నాడు, ఈ పాఠమే మనము కూడ నేర్చుకొనవలసి యున్నది. దేవుని ఎట్లు అడుగవలెనో ఇంతవరకు మనము ఎరుగము. మనము అడుగ నేర్చుకొని నప్పుడు మనము అడుగువాటన్నిటి కంటేను, తలంచు వాటి కంటేను, ఊహించువాటన్నిటి కంటెను అత్యధికముగా ప్రభువు మనకు దయచేయును.

## "నేను భూమిమీద నుండి పైకెత్తబడినప్పుడు అందరిని నా యొద్దకు ఆకర్షించుకొందును"

ఈ హెల్లేనీయులు ఎంత ఆశతో ప్రభువును చూడవలెనని వచ్చి యుండిరో వారి హృదయములను ప్రభువు ఎరిగియుండెను తప్పులు పట్టుకొనుటకు పరిసయ్యులు వచ్చినట్లుగాని, స్వస్థత పొందుటకువచ్చిన వారివలెగాని, ఏదో మేలుపొందుటకు వచ్చిన వారివలెగాని హెల్లేనీయులు రాలేదు. ఆయనను చూచితే చాలునని వారి కోరిక. చూచిన సంతోషముగాక, ఈ ఆశ్చర్యకరుడైన వ్యక్తిని చూచితిమి అని ఇతరులకు చెప్పుకొనుటకు కూడ సాధ్య పడును. ఇదంతయు ఎరిగియే ప్రభువు అట్లు జవాబిచ్చెను. దాని భావము-"నన్ను ఈ రీతిగా చూచినంత మాత్రమున ఏమియు జరుగదు. విజయమొందునట్లు నన్ను చూచుటకు నేర్చుకొనుడి" అనగా కొన్ని నిమిషములు మాత్రమే ఆయనను చూచి వెళ్ళి పోవుట కాదు. నిరంతరము ఆయనను చూచుచు, ఆయనతోనే గడుపవలెనని ఆయన కోరుచున్నాడు. అప్పుడే ఆయన యొక్క నిజమైన మహాత్మ్యమును, మహిమను నీవు తెలిసికొనగలవు.

అయితే ఆయనను మనము ఆ రీతిగా ఎట్లు చూడగలము? "మనుష్యకుమారుడు మహిమ పొందవలసిన గడియ వచ్చి యున్నది" అని ప్రభువు శిష్యులతో అంతకు మునుపే చెప్పియుం డెను. ఆ మాటల ద్వారా తన మరణమును సూచించెను. అటు తరువాత ఆయన తెలిపినది ఏమనగా, "నేను భూమిమీదనుండి పైకెత్తబడినప్పుడు అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందును." తాను ఏ విధముగా మరణించవలసి యుండెనో ఈ ప్రకారము ప్రభువు విశదపరచెను. అనగా, ఈ మాటలన్నియు చెప్పుచుం నడి సమయము యావత్తు, తన మరణముపై నున్న, మరణిం

చుటవలన ఆయన ఏ విధముగా మహిమపరచ బడనైయుండెనో, దానినిగూర్చియు తలంపు కలిగియుండెను. కావున ఆ జనులతో ఆ విషయమే మాటలాడుచుండెను. "నాయందు మహాదేవుని యొక్క మహిమను మానవులు చూడవలెననియే ఈ లోకమునకు వచ్చితిని. మీరు నన్ను నిజముగా చూడవలెననిన, గోధుమగింజ వలె నేను మరణించవలెను అప్పుడు మీరు నన్ను చూచుటమాత్రమే కాక, నన్ను పోలియుందురు" అని వారితో చెప్పెను.

నీవు మురికితో, మైలతో నిండుకొనిన ఒక బిక్షగాడవు అనుకొనుము. ఒక రాజును దర్శింపబోవుచున్నావు. నీ కంపు కొట్టు వస్త్రములు నాలుగైదు ఏండ్లగా నీమీదనుండి తీసి వేయ లేదు. నీ పొడువైన వెంట్రుకలు పాతిక సంవత్సరములనుండి కత్తిరించకనే పెరిగిపోయినవి. నీవు ఎన్ని సంవత్సరముల క్రిందట స్నానము చేసియుంటివో చెప్పజాలవు. ఇట్టి విగ్రహముగా మహారాజును చూడబోయి ఇట్లనుచున్నావు. "ఘనత వహించిన మహారాజా, ఒక్క నిముషము తమ ముఖారవిందము చూడనిండు" అని మనవి చేసితివి. "లోనికి రమ్ము" అని సెలవాయెను. నీవు ప్రవేశించితివి. ముందుగా ఒక మంగలివానిని రాజు పిలిపించి, నీ వెంట్రుకలను చక్కగా కత్తిరించుమని ఆజ్ఞాపించెను. పిమ్మట ఒక క్రొత్త వస్త్రము నీకు ధరింపజేసి, నిన్ను వెలుపలికి కొనిపోయి "ఇప్పుడు నా రాకుమారునిగా వెడలిపొమ్ము" అని సెలవిచ్చెను. అప్పుడు నీ కెట్లుండును? మురికి తోలువంటిబట్టలతో ఒక భిక్షగానిగా రెండు నిమిషములు రాజుగారి ముఖము చూచిపోదమని లోన ప్రవేశించినవాడవు. ఒక రాజకుమారునిగా రాజసన్నిధినుండి వెలుపలికి వచ్చుచున్నావు మన ప్రభువు ఆ హెల్లేనీయులకు పంపిన జవాబులోని అర్థమిదే. "ఊరకనేచూచి వెళ్ళిపోవుట మీ యుద్దేశమా? నన్ను మీరు చూచుచునే యుండి

నన్ను పోలియుండవలెను". ఇది సాధ్యమా? నన్ను సాధ్యమే యని సూచించుటకు, "గోధుమగింజ భూమిలోపడి చావకుండిన యెడల అది ఒంటిగానేయుండును" అనెను. ఒక చిన్న ధాన్యపు గింజనుండి వందలకొలది ధాన్యపుగింజలు పుట్టునని మీరు ఎరిగిన విషయమే. ఈ ఉపమానముద్వారా మన ప్రభువు బోధించుచున్న సత్యము ఇదే—'ఈ హెల్లేనీయులేగాక సర్వ లోకము నన్ను నిరంతరము చూడగలుగునట్లును, నన్ను ఎవ రెవరు చూతురో వారు నన్ను పోలియుండునట్లును, నేను మర ణించవలసి యున్నది'. అనగా అద్భుతములు, సూచనలు, ఆశ్చర్యకార్యములు, ఇంకను ఏయే విధములుగా లోకములోమను ష్యులను ఆకర్షించుటకు ప్రయత్నింతురో ఆ సాధనముల ద్వారా గాక, కేవలము తాను సిలువమీద పైకెత్తబడుట ద్వారానే ప్రజ లను తాను ఆకర్షించునని బోధించుచున్నాడు.

ఒక కాలమందు ఎందరో భారతీయులు తాము పశ్చిమ దేశస్థుల దుస్తులను ధరించినచో క్రైస్తవులగుదుమని తలచిరి. మరియు పాశ్చాత్యుల పేరులను కలిగినయెడల ఉద్యోగములు దొరుకునని జార్జి, హెన్రీ, చార్లెస్ మొదలైన పాశ్చాత్యుల నామ ములు పెట్టుకొనిరి. అయితే ఈ పేరులు చెల్లని కాలమువచ్చెను అప్పుడు జార్జులు, హెన్రీలు, చార్లెస్లు పాపయ్య, మునిస్వామి, ముత్తయ్య, పుల్లయ్యలుగా మారిపోయిరి. పేర్లు, వస్త్రములు మారెనుగాని వ్యక్తులు వారే; ఇవి నిన్ను క్రైస్తవునిగా చేయ జాలవు. "నేను నిన్ను మార్చి నావలె చేయుదును" అని ప్రభువు చెప్పుచున్నాడు. ఒక గోధుమగింజ చావగా, అవి విస్తారముగా తెచ్చు ఫలము దానివంటి గోధుమగింజలే. అదేవిధముగా మనం ఆయనవంటి వారము కావలెననియే క్రీస్తు మరణించెను.

అనేక శతాబ్దములు సిలువయొక్క విగ్రహమును మనుష్యులు గ్రుడ్డితనముగా ఆరాధించుచు దానికి ధూపము వేయుచు వచ్చిరి. దేవుడేమి చెప్పుచున్నాడో చూడుము-"సిలువనుగూర్చిన వార్త నశించుచున్న వారికి వెఱ్ఱితనముగాను రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి....యూదులకేమి, హెల్లేనీయులకేమి పిలువబడినవారికి క్రీస్తు దేవుని శక్తియును, దేవుని జ్ఞానమునై యున్నాడు" (1 కొరింథి. 1:18-24). దేవుని ఎదుట మనుష్యులను బుద్ధిహీనులుగా, అత్యంత దుర్బలులుగాను చేసినది పాపమే ద్రవ్యము సంపాదించుటకు ఎంతో శ్రమపడి పనిచేయుచున్నాం. సంపాదించిన వెనుక అంతయు పాడుచేయుచున్నాము. మన చేతులను కాళ్ళను పాపమును, అవమానమును తెచ్చుకొనుటకే మనము ఉపయోగించుచున్నాము. మన జీవితములు దుఃఖదాయకములైనవి. మన ప్రాణములకు సేదదీర్చి, మనలను ప్రభువైన యేసుక్రీస్తులో జ్ఞానులుగాను, బలశాలులుగాను చేయుటకై దేవుడు సంకల్పించియున్నాడు. ఈ జ్ఞానము, శక్తి, సిలువనుండియే మనకు రాగలదు.

ప్రభువు చెప్పిన దేమనగా—"నేను భూమి మీదినుండి పైకెత్తబడినప్పుడు అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందును." మానవ బుద్ధిహీనత ఎంతటిదనగా లౌకికజ్ఞానమువలన, పనుల వలన యితరులను ఆకర్షించుకొనగలమని మనుష్యులు తలంచుచున్నారు. ప్రపంచమందు అనేక భాగములందు క్రైస్తవ పరిచర్యలో మనము చూచు గొడ్డుతనము యిందులకే, ఎవరైతే సిలువను స్వీకరించి సిలువానుభవములోనికి దిగి సంపూర్ణంగా మార్చబడియున్నారో, వారు క్రీస్తును పోలియుండునంతవరకు రూపాంతరము పొందుచునే యుందురు.

సిలువవైపు చూడగా ఒకరి జీవితము ఎట్లు రూపాంతరం పొందగలదో, ఈ క్రింది దృష్టాంతమువలన స్పష్టమగును. ఒక చిత్రకారుడు సిలువపైనున్న యేసుక్రీస్తు ప్రభువుయొక్క పటమును చిత్రించెను. అతడు యూదుడై యున్నందున క్రీస్తునందు విశ్వసించిన వాడుకాడు. యింకొక మారు ఒకానొక యువతి యొక్క పటమును గీయనారంభించెను. ఈ పటము పూర్తియగు వరకు ఆ యువతి ఆ చిత్రకారుని స్టూడియోకు వెళ్లవలసి యుండెను. వచ్చినప్పుడెల్ల "సిలువపైనున్న అతడెవరు? అని చిత్రకారుని ప్రశ్నించుచుండెను. ఈ ప్రశ్న చిత్రకారుని కలవరపరచు చుండినందున" నీ పటము వేస్తున్నాను. నన్ను తొందర చేయకు అని ప్రత్యుత్తరమిచ్చుచుండెను. అయినను ఆమె మాటిమాటికి అదే ప్రశ్న వేయుచుండినందున సిలువనుగూర్చిన కథను ఆతడు ఆ బాలికకు చెప్పవలసి వచ్చెను. క్రీస్తుయొక్క మరణం భూస్థాపన, పునరుత్థానములనుగూర్చి కొద్దిమాటలలో క్లుప్తముగా వినిపించెను. అదంతయు గడచి కొంతకాలమాయెను, ఒకానొక దినమున ఆ బాలిక యొద్దనుండి ఆ చిత్రకారునికి ఒక వర్తమానము వచ్చెను. ''నేను చనిపోవుచున్నాను దయతో వచ్చి నన్ను చూడండి.'' అతడు వెళ్ళి మరణపడక మీద నున్న బాలిక యొక్క ప్రకాశమైన ముఖమును చూచెను. ఆ బాలిక చిత్రకారునితో యిట్లనెను.... ''అయ్యా, నాకు మీరు రక్షణ మార్గము చూపినందుకు మనసార వందనములు చెల్లిస్తున్నాను. నేను మహా పాపిని నామరణ గడియవచ్చెను అయితే, నా ప్రభువు నా పాపములు క్షమించెనని నే నెరుగుదును,'' ఏలాగు ఎరుగుదువు? అని అతడు అడిగెను. నేను మీ స్టూడియోకి వస్తున్నప్పుడు ఆ పటము ఏమిటో చెప్పమని నేను అడుగగా మీరు ఆ కథను చెప్పి తిరిగదా? అది వినినప్పటినుండి నెమ్మది లేకుంటిని. నా పాప

ములు నాకు కనబడడం మొదలుపెట్టినవి, అప్పుడు నా పాప ములకొరకే క్రీస్తు మరణించెనను విషయము గ్రహించి నా పాపములు ఒప్పుకొంటిని. ఆయన నన్ను క్షమించెనని నే నెరు గుదును. మీ వలననే కదా నాకు రక్షకుడు దొరికెను. అందుకే నేను చావకముందు మీకు వందనములు చెల్లించవలెనని కోరితిని ఇట్లు చెప్పిన పిమ్మట సమాధానముతో ఆమె ప్రాణము విడిచెను.

అప్పుడా చిత్రకారుడు తనలోతాను ఇట్లు అనుకొనెను: "ఎన్ని ఏండ్లుగానో ఈ సిలువ పటము నా స్టూడియోలోఉన్నది. దానిమర్మము ఇప్పటివరకు నాకు తెలిసియుండలేదు. సిలువశక్తి ఎంతటిదో ఇప్పటికి తెలిసినది" ఆతడు తనపాపముల విషయం పశ్చాత్తాపపడి బిగ్గరగా: "ఓ ప్రభువా, నా పాపములకొరకు నీవు మరణించినందులకు నీకు నా వందనములు" అని ప్రార్థించెను. అటుపిమ్మట ఎంతో కాలం బహుశ్రద్ధతో సిలువపై నున్న యేసునాథుని పటము మరొకటి చిత్రించి ఆ పటముయొక్క అడుగున ఈమాటలు వ్రాసెను- "ఇదంతయు నీ కొరకే చేసితిని. నాకొరకు నీవేమి చేసితివి?"

చిత్రకారుడుకూడ చనిపోయెను. బెర్లిన్ నగరంలోని ఒకానొక వస్తు ప్రదర్శశాలయందు ఈ చిత్రపటం ఉంచబడెను. చిత్రపటములనుచూచుటకు అనేకులు ఈ ప్రదర్శనశాలకు వెళ్ళు చుండిరి. కౌంట్ జింజెండార్ఫ్ అనబడిన ధనికుడైన ఒక ప్రభువు తన భవనమందు ఉంచుటకు ఒక మంచి చిత్రము కొనవలెనని ఆ ప్రదర్శనశాలకు వచ్చెను

ఒకటి తరువాత నొకటిగా ఆ చిత్రములను చూచుచువెళ్లుచుండెను. సిలువ పటములో దిగువ వ్రాయబడిన మాటలు అతనిని ఆకర్షించెను "ఇదంతయు నీ కొరకు నే చేసితిని" నా కొరకు ఏమి చేసితివి? ఆ చిత్రముమీద నుండి ఆ వ్యక్తి తన దృష్టిని మరల్చ లేకుండెను. అనగా మాటలు తన హృదయములోనికి లోతుగా చొరబడెను. ఎప్పటికంటెను ఎక్కువగా ఆ మాటలు అతనిని ప్రభువు సమీపమునకు లాగెను. సిలువమీద యేసుయొక్క వట్టి పటము మాత్రమును కొనలేదుగాని నిజముగానే యేసు ప్రభువు తన ఎదుట నున్నట్లు ఈ జర్మన్ వ్యక్తికి తోచెను. "దేవుని సన్నిధిలో ఉన్నాను" అని అతనికి అనిపించెను. తన ప్రక్కనే ప్రభువు నిలిచి ఈ విధంగా తనతో పలికినట్లు జింజెండార్ఫుకు తోచెను. "ఇదంతయు నీకొరకే నే చేసితిని. నా కొరకు నీవేమి చేసితివి నీకొరకు మేకులు దిగగొట్టబడుటకై నా చేతులిచ్చితిని. నీ కొరకు మేకులు గ్రుచ్చబడుటకై నా పాదములిచ్చితిని. నీ కొరకు కొరడా దెబ్బలు భరించుటకై నా వీపును అప్పగించితిని. నీ కొరకు ఉమ్మివేయబడుటకై నా ముఖము నిచ్చితిని. నీ నిమిత్తము ముండ్లకిరీటము ధరించుటకై నా శిరము నిచ్చితిని నా కొరకు నీవేమి చేసితివి?"

ఆ స్థలమును విడిచిపెట్టిపోవుటకు జింజెండార్ఫుకు కాళ్ళు రాకుండెను. మాటిమాటికి "నా కొరకు" "నా కొరకు" అని చెప్పుచుండెను. ఒకటి తరువాత నొకటి అతని పాపములు అతనికి కనబడగా "ఆయన నా కొరకు చనిపోయెను" అని బిగ్గరగా చెప్పెను. కన్నీళ్లు తన చెక్కిళ్ళ నుండి రాల నారంభించెను. గంటలకొలది అక్కడే నిలిచిపోయి ఏడ్చుచుండగా, కావలివాడు అతనిని సమీపించి, "అయ్యా,

చాలా ఆలస్యమయినది. నేను ఇంటికి వెళ్లిపోవాలని" అనెను. ఆ ప్రభువు ఆ చిత్రపటమును కొనుక్కొని, ఇంటికి తీసుకొని పోయెను. తదుపరి తనకున్నదంతయును అమ్మివేసి ఆ ద్రవ్యమును సువార్తసేవకొరకు ఇట్లనుచు వినియోగించెను— "ప్రభువా, నీవు నాకొరకు ఇంత జేసితివి. ఇప్పుడు నీ కొరకు నా సమస్తము నిచ్చుచున్నాను". అంతకుపూర్వము ఇతర దేశములలో సువార్త ప్రకటించు నిమిత్తము మిషనరీలను పంపుటకు మిషనులు ఉండలేదు. తన ఆస్తినంతయు పెట్టి, ఈ మొరేవియా దేశస్థుడగు కౌర్ట్ జింజెండార్ఫ్ (Court Zenzendors) స్థాపించిన మొరేవియన్ మిషన్ (Moravian Mission) మొదటిది. దీనిని చూచి ఆయా క్రైస్తవ దేశములలో అనేక మిషన్లను స్థాపించెను. ఇట్లు మొరేవియన్ మిషన్ స్థాపకముతో సువార్త బహుబలముగా ఇతర దేశములకు కొనిపోబడుట ఆరంభమాయెను. లక్షలకొలది జనులు సిలువయొద్దకు ఆకర్షింపబడిరి.

## సిలువయొక్క అర్థము

నీ జీవితములో సిలువ కార్యము జరుగుట సులభము కాదు. పరిశుద్ధాత్మద్వారా మాత్రమే ఇది జరుగగలదు. ఇప్పుడో, ఎప్పుడో ఈ కార్యము నీ జీవితమందు జరుగవచ్చును. ఒకటి మాత్రం నిశ్చయము-ఎప్పుడైతే సిలువయొక్క అర్థమును గ్రహింతువో అప్పటినుండి నీవు వేరేవ్యక్తిగ మారిపోదువు. నీ జీవితమందు నూతనశక్తి ప్రవేశించును. నీవు నీ పాతస్వభావమునకు మరణించవలెననియే క్రీస్తు మరణించెను. ఆయనతో నీవు లేచి, నూతనసృష్టి కావలెననియే ఆయన తిరిగి లేచెను.

సిలువనుగూర్చి చెప్పవలెనంటే ఎంతోయున్నది. అట్టి ఘోరమరణము క్రీస్తు ఏల పొందెను. దేవదూతల నిమిత్తమై

యుండునా? వారికది అవసరము కాదు. ఆయన తనకొరకు మరణించియుండెనా? తాను ఏ పాపము నెరుగనివాడు. పక్షులు, మృగములనిమిత్తము మరణించలేదు. నానిమిత్తం మరియు నీకు తెలియునో లేదోగాని, నీ నిమిత్తమును మరణించెను. పాపమెరుగని ఆయన పాప నరులకొరకు ఏల మరణించెను? దుష్టులు ఆయనను అపహరింపనేల? సిలువనుగూర్చిన ఏడు అంశములు తెలుపుచు ఈ ప్రశ్నలకు సమాధానము చెప్పెదను. ఒకటి: న్యాయతీర్పునుండియు, పాపమువలన కలుగు శిక్షావిధినుండియు నన్ను విడిపించు నిమిత్తము ఆయన నా పాపములకొరకు చనిపోయెను. రెండవది: నా దౌర్భాగ్యపు పాప స్వభావమునకు నేను మరణించవలెనని ఆయన మరణించెను. మూడవది: లోకమునకు-దానివంచనకు నేను మరణించవలెనని ఆయన మరణించెను. నాల్గవది: పాత సృష్టిని అంతం చేయుటకు ఆయన మరణించెను చెట్టుమొదలును నరికినప్పుడు చెట్టు యావత్తుకూలును. అదేవిధంగా మన సృష్టికర్తయైన దేవుడు మరణించగా సమస్తం మరణించెను. పాతసృష్టిని అంతం చేయుటకై ఆయన మరణించెను. ఐదవది: నా జీవాహారమగుటకు ఆయన మరణించెను. ఆరవది: మనలను ఏక శరీరముగాను, ఏక కుటుంబముగాను చేయుటకై ఆయన మరణించెను. ఏడవది: ఆయనను పోలిన సంపూర్ణమైన నూతన సృష్టిగా మనం కావలెనని ఆయన మరణించెను. ఈ సత్యములను మనం స్పష్టంగా గ్రహించి విశ్వాసంతో యేసుప్రభువుయొక్క సిలువవైపు చూచినప్పుడు మనం నూతన జీవమును పొందుదుము.

## చూచి ఆయనను పోలియుండుము

నే నింకను విస్తరించి చెప్పను. అయితే ఒక్క మనవి. ప్రభువైన యేసుక్రీస్తు సిలువవైపు చూడ నేర్చుకొనుడి. "మేము

యేసును చూడగోరుచున్నాము" ఇట్లు హెల్లేనీయులు చెప్పిరి మన ప్రభువుయొక్క ప్రత్యుత్తరమిదిగో- "నా ప్రియ స్నేహితులారా, మీరు నన్ను చూడగోరుచున్నారా? అట్లయిన, భూమిలో పడి చనిపోవు గోధుమగింజవలె మున్ముందు నా మరణంలో పాలివారుకండి. ఏ మానవుడును తన్ను తాను రక్షించుకొనజాలడు. ఆతడు పలువిధములు ప్రయత్నింపవచ్చును. ఉపవాసముండవచ్చును. ఏడ్వవచ్చును, దీర్ఘప్రార్థనలు చేయవచ్చును. కష్టములు సహింపవచ్చును. అయినప్పటికిని తన్ను తాను రక్షించుకొనజాలడు. విశ్వాసముద్వారా మాత్రమే మనం ప్రభువైన యేసుక్రీస్తు మరణమందు పాలివారము కాగలం. ఉదాహరణకు : కొందరికి ఎన్నోఏండ్లుగా చుట్టలుకాల్చు అభ్యాసమున్నది. "రేపటినుంచి తప్పక చుట్టలు మానేస్తాను" అని ప్రమాణం చేసికొందురు. ఒకవారం గడచినంతలో చాటుగా చుట్టకాల్చుట ప్రారంభించుచున్నారు ఎందుకనగా ఆ అభ్యాసమునకు బానిసలై పోయిరి. దానితో పెనుగులాడుచున్నారు గాని విడుదల రాకున్నది. సిలువను గ్రహించితిమా ఒక్కక్షణంలో ప్రతిపాపము, ప్రతిదుర్గుణము ఎగిరిపోవును. ప్రభువైన యేసు క్రీస్తుయొక్క శక్తివలనను, అది మనలో చేయుచుండు పనివలనను, పాపముపై విజయము మన కొసగబడుచున్నది.

సిలువను చూచినకొలది మనం అంతకంతకు యేసు ప్రభువు పోలికలోనికి మార్చబడుచున్నాము. ఉదాహరణకు : భార్యాభర్తలను చూతుము. వివాహమునకు పూర్వము బాహ్యరూపమునే చూచి ఆకర్షింపబడిరి. వివాహమైనవెనుక అంతరంగిక సుగుణములే వారికి ఎక్కువ అవసరముగానున్నది. అదివరలో గమనింపకుండిన సుగుణములు ఒకరిలోనొకరికి

ఇప్పుడు ప్రత్యక్షపడుచున్నవి. వివాహమునకు పూర్వము వేరు వేరు పోలికలు కలిగియుండిన వీరు అనేక సంవత్సరముల దాంపత్యముపలన సోదర సోదరీలవలె కనబడుచున్నారు. యేసు ప్రభువు యొక్క జీవము నీలో ప్రవేశింపగా ఈ రీతిగానే జరుగును. సిలువకార్యము నీలో జరిగినకొలది ఆయన పోలికలో మార్చబడుచుందువు.

నీవు అద్భుతములు చూడవచ్చును. స్వప్నములు గాంచవచ్చును. అయినను, సిలువయొద్దకువచ్చి విశ్వాస ప్రత్యక్షతల ద్వారానే ఆయన నీ నిమిత్తము చేసినకార్యమును నీవు గ్రహించు పర్యంతము నీవు ప్రభువును చూడజాలవు. గ్రహించిన తరువాత ఎల్లప్పుడును, ఎల్లడల ప్రతినిత్యము నీవు ఆయనను, ఆయన పరలోక మహిమను కూడ చూడగలవు ఏమి యానందము! ఇట్టి యనుభవము నీకింకను లేకుండినచో, రమ్ము, ఇప్పుడే వచ్చి దానిని పొందుము.

❋❋

# 5

## చూచి విజయము పొందుము

### నేను లోకమును జయించియున్నాను

ప్రభువు మనలను తన్నుగూర్చియు తన మహిమను గూర్చియు ఒక స్పష్టమైన దృశ్యము కలిగియుండవలెనని కోరుచున్నాడు. మనము ఆయనను చూచుటలేదు. ఆయన ఏమైయున్నాడో మనం ఎరుగుటలేదు. మనకువచ్చు కష్టములలో అధికభాగము ఈ కారణమువల్లనే. ఎప్పుడు అధైర్యము, ఆశాభంగము, అపజయములతో బాధనొందుచున్నామో, వాటిని

తప్పక నివారణచేయు ఔషధమొకటి మనకున్నది. ప్రభువైన యేసుక్రీస్తువైపు తిరిగిచూచి, ఆయననుగూర్చిన నూతన దర్శనము పొందుము, ప్రపంచమంతటను క్రైస్తవులు తమలో పరిశుద్ధతలేదని గ్రహింపు కలిగియున్నారు. దేవుని జనులలో జీవంగాని, శక్తిగాని మనకు అగుపడుటలేదు. ప్రభువే మో ఇట్లు చెప్పియున్నాడు. "....నేను చేయుక్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును; వాటికంటె మరి గొప్పవియు అతడుచేయును" (యోహాను 14:12). తిరిగి ఇది కూడ అనెను . . . "ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నాను" (మత్తయి 28:20). హెబ్రీ. 13:8లో ఈ రీతిగా చదువుచున్నాము." యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటేరీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకు ఒక్కటే రీతిగా ఉండును" ప్రతిక్రైస్తవుని ఎరిగిన దైవగ్రంథములోని ఈ వాక్యమువలన దేవుడెన్నడును తప్పనివాడని తెలిసికొనుచున్నాము. అయితే మనము తప్పుచున్నాము అందువలన ఆయనశక్తిని పొందకున్నాము.

తన ప్రజలపై అపవాది ప్రయోగించెడు ప్రతి పన్నాగమును ప్రభువు ముందుగనే ఎరిగియున్నాడు. అందువలననే మనకు హెచ్చరిక కలిగించు అనేక మాటలను ఆయన చెప్పియున్నాడు. అపవాది గర్జించు సింహంవలే లేక క్రూరమైన తోడేలువలె లేదా ఒక వరదవలె, లేకున్నచో ఒక వెలుగు దూతవలె వచ్చుచున్నాడని మనమెరిగిన విషయమే. శత్రువు బలవంతుడైనందున మనమోడిపోదుమని తలంచరాదు. మన ప్రభువు బహుస్పష్టంగా చెప్పినదేమనగా "ధైర్యముతెచ్చుకొనుడి. నేను లోకమును జయించియున్నాను" (యోహను 16:33). ఆయన వలననే ఆయన ద్వారా మాత్రమే మనము విజయులము

కాగలము. విజయవంతమైన జీవితము మనం అనుభవించ వలెనంటే ఆయనను గూర్చిన స్పష్టమైన దృశ్యము మనము పొందితీరవలెను.

## సంపూర్ణముగా తిరిగి తెచ్చుకొనుట

అత్యధికంగా విజయవంతుల మగుటకు మన మెట్లు ప్రభువైన యేసుక్రీస్తు యొద్దకు రావలసియున్నదో ప్రకటన గ్రంథమందు చూచుచున్నాము. ఈ గ్రంథముయొక్క వర్తమానం సంపూర్ణవిజయంను గూర్చినవర్తమానం. ఈవిజయం నూతన సృష్టిలోని సకలంనకు మనలను వారసులంగాచేసి,మనంపోగొట్టు కొనిన సమస్తమును తిరిగి తెచ్చుకొనుటకు అర్హులంగా చేయు చున్నది. ఏది పోగొట్టు కొనుటకైనను మనము ఇష్టపడము. అయిన నేమి? దీనినో, దానినో, పోగొట్టుకొనుచునే యుందుము. మన అజాగ్రత్తవలననో, మతిమరుపు వలననో, దొంగిలింప బడుటవలననో మన వస్తువులు పోవుచుండును. బాల్యమందు పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు మొదలైనవి వార వారము పోగొట్టుకొనుచు వారము వారము మన తల్లుల కడకు పోయి మననష్టము చెప్పుకొంటిమి. పెద్దవారమైన పిమ్మట తాళపు చెవులు, చెప్పులు, కంటి అద్దములు, ఇట్టివి అజాగ్రత్త వలన పోగొట్టుకొంటిమి. ఇప్పుడును రైలుబండ్లలో గొడుగులు ఇంక వేరే వస్తువులు మరచి విడచి పెట్టుచున్నాము. మన వస్త్రము లను ఎన్నింటినో చాకలి నాశనము చేయుచున్నాడు. కొందరు పాత్రలను ఎల్లప్పుడు జారవిడిచి పగుల గొట్టుటచేత వీరి హస్త ములయందు రంధ్రములున్నవి కాబోలు అనిపించును. మనం నష్టపడిన వస్తువులపట్టి పెద్దదే. ఒక దినం ఎవరో నీ యొద్దకు

వచ్చి, "ఏమండీ! నా వెంబడిరండి. మీరు ఎప్పుడెప్పుడు ఏయే వస్తువులు పోగొట్టుకొంటిరో, అవన్నీ మీకు కనబడును"అని చెప్పెననుకొనుడి నీవు అతని వెంట వెళ్ళిచూడగా నీవు పోగొట్టు కొనిన సమస్తమును అక్కడ కనబడుచున్నవి. ఏమి ఆశ్చర్యము మరియు, ప్రతి వస్తువు సరి క్రొత్తదిగా నున్నది. ఇప్పుడు నీ సంతోషమునకు హద్దులుండునా ? ఇట్లందువు కదా? "ప్రభువునకు స్తోత్రం. పోయిన నావస్తువులన్నీ తిరిగిదొరికినవి."

ఇదే వర్తమానము ప్రకటన గ్రంథంలో నున్నది. ఆదాము హవ్వలు ఏదేను వనమందు పాపముచేసిన దినము మొదలు పోగొట్టుకొనిన సమస్తమును, ఏ విధంగా తిరిగి సంపాదించు కొనవచ్చునో ఈ గ్రంథము తెలుపుచున్నది. మానవాళి సమస్తమును పోగొట్టుకొనుట పాప శాపంవల్లనే. మనం పోగొట్టుకొనిన సమస్తంను మనకై తిరిగి సంపాదించుటకే ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. నేను చిన్న పిల్లవానిగా నున్నప్పుడు ఒక గారడీవానిని చూచితిని. ఎవరియొద్దనుండియో ఒక గడియారంను తీసి, దానిని ఒక ఖాళీ పాత్రలో నుంచెను. ఒక సుత్తెతో ఆ గడియారంను కొట్టి దానిని ముక్కలు ముక్కలుగా చేసెను. అటుపిమ్మట ఆ పాత్రపై నొక వస్త్రమును కప్పి, లోపల నుండి ఆ గడియారమును పైకి తీసి చూడగా, ఏ పగులు భంగములేక బాగుగానే యుండెను. చూచిన వారందరు అతడు దీనిని ఎట్లు చేసెనని ఆశ్చర్యపడిరి. గారడీవాడు మాపై మంత్రము చేసెను. అంతే, కాని ఆత్మీయంగా మన ప్రభువు ఆశ్చర్యకార్యములు చేయును. పాప మలినముచే చెడిపోయిన మన జీవితములను తీసి వాటిని సర్వ పరిపూర్ణము చేయును.

## మనము ఆయనను పోలియుందుము

మనం జీవించుచున్నది ఫొటో గ్రాఫ్‌ల కాలము ఎక్కడ

చూచినను కెమేరాలను పట్టుకొని తిరిగే వారు కనబడుచున్నారు. అవి లేని అనేకులు తాము కూడ అట్టికెమేరాలను పట్టుకొని తిరుగు దినము వచ్చునని కలలు కనుచున్నారు. అనేకులు తాము ఫొటో తీయించుకొనపోయినప్పుడు అందముగా కనపడ వలెననుకొనినచో, అరువు తీసికొనినవో, ఒక చక్కని సూటు తొడుగుకొని, చేతికి ఉంగరమొకటి, చేతికి గడియారమొకటి పెట్టుకొనుచున్నారు. నేను మొట్ట మొదటి ఫొటో తీయించుకొన్న ప్పుడు ఒక అరువుతీసికొనిన రిస్టువాచిని పెట్టుకొంటిని. ఫొటోప్రూఫ్ (Proof) రాగానే, ఆ రిస్టు వాచి ఫొటోలో పడినదా లేదా అని దానినే ముందుగా చూడగోరితిని. అది కనబడగా అమితానం దము పొందితిని. నేనునల్లని వాణ్ణి. ఫొటోగ్రాఫర్ ఒక కుంచెను తీసి దానితో పటములో నా ముఖమును తెలుపు చేసివేసెను.

మనమున్న దానికంటే చక్కగా కనబడవలెనని కోరుట మానవ స్వభావము. అయితే మన నిజ స్వరూపము ఉన్నట్లు గానే మన ఛాయాచిత్రంను దేవుడు తన వాక్యమందు కనబరచు చున్నాడు. బైబిలు గ్రంథము ఏమిచెప్పుచున్నది? "అరకాలు మొదలు కొని తల వరకు స్వస్థత కొంచెమైనను లేదు. ఎక్కడ చూచినను గాయములు! దెబ్బలు, పచ్చిపుండ్లు. అవి పిండ లేదు. కట్టబడలేదు తైలముతో మెత్తన చేయబడలేదు" (యెషయా 1:6). ఎంత విషాదకరమైన పటమో! నీ యెదుట ఇట్లు వివరింప బడినవాడు నిలిచి యున్నాడని ఊహించుము. అతనిలో తలనుండి అరికాలువరకు గాయములు, దెబ్బలు, పచ్చి పుండ్లు తప్ప మరేమియు కనబడుటలేదు. ఆ దృశ్యమును మనం చూడనసహ్యించుకొనుచున్నాము. అయితే దేవుడు మనలో చూచు నది ఈ దృశ్యమే ఆయన దృష్టియందు మన ఆత్మీయ స్థితిఇదే. ఒకడు డాక్టర్ యొద్దకు వెళ్ళెను. బాగుగానే కనబడుచున్నాడు.

అయితే ఒక భయంకరమైన వ్యాధి అతనిలో నుండుట డాక్టరు కనిపెట్టెను. ఒక ఆపరేషన్ చేసి చూడగా ఆ వ్యాధి ముదిరి పోయి యుండుట తెలిసెను. "ఏమియు చేయలేము,"అని వ్యసనముతో వైద్యుడు చెప్పుచున్నాడు. అతను వైద్యుని యొద్దకు వెళ్ళినప్పుడు బాగుగానే కనబడెను. అయినను కనీసం ఒకటి లేక రెండు మాసములు మాత్రమే అతడు జీవించునని డాక్టరు చెప్పుచున్నాడు. అతని స్నేహితులకు ఈ వార్త నమ్మశక్యము కాకున్నది. "ఇది ఎక్కడయినా కద్దా? అంతా బాగున్నట్టు కనబడ్డాడు ఇంత త్వరలో చచ్చిపోతాడా?" అంటున్నారు. లోపల ఉన్న వ్యాధిని వైద్యుడు చూడగలడు గాని స్నేహితులు చూడగలరా? మన అంతరంగిక చెడుగును, మన పాప స్వభావమును దేవుడు చూచుచున్నాడు. నీవు సొగసుగా నున్నావని నీవు తలంచవచ్చును. నీ ముఖము మీద పాపము, దాని శాపము ఆయన కంటికి కనబడు చున్నందున నీవు విపరీతంగా నున్నావని దేవుడు చెప్పుచున్నాడు. ప్రతి యొక్కరి నిజ స్థితిఇదే.

ఇకనేమి ఆశలు లేవని నీ విషయము వైద్యుడు చెప్పవచ్చును. గాని, మన ప్రభువు చెప్పడు. మనతో ఆయన రెండు విషయములు చెప్పుచున్నాడు. మనం పాపం చేసియున్నామని తెలుపుచున్నాడు. మనం సంపూర్ణంగా మార్చబడి రూపాంతరము పొందగలమని కూడ చెప్పుచున్నాడు "నీ దుర్మార్గత మించిపోయి యున్నది నిన్ను మార్చుట నా శక్యముగాదు. నాకు చాలా విచారము"అని ప్రభువు అనడు. తమ బిడ్డలు పాపములో పడి చెడిపోయి యుండగా అనేక తల్లిదండ్రులు ఇట్లనుచున్నారు. "వారిని మార్చివేయుటకు మా చేతనైనంత చేసితిమి. అయినను వారు తిరుగుట మానలేదు." ఈ జనని జనకులు ఆ బిడ్డలను గద్దించి చూచిరి, శిక్షించి చూచిరి. ఎన్ని చేసిననూ

బాగుపడక యుండిన యెడల, "ఇంటినుండి వెళ్లిపో. మా బిడ్డవు అవడానికి నీవు తగవు." అనుచున్నారు. ఈ విధంగా ప్రభువైన యేసు నిన్ను అనడు ఇంత పాపపు, అవమానపు స్థితియందు మనముండుటచూచియు "నా బిడ్డా, నిన్ను నేను మార్చివేసి నా పోలికతో నిన్ను చేయుదును," అని చెప్పును. "మనం ఆయనను పోలియుందుము" (1 యోహాను 3:2). ఎటువంటి ఆశ్చర్యకరమైన మాటలివి! దేవదూతలు కూడమనలను చూచి మెచ్చుకొందురు. ఎందుకనగా మనము వారిని పోలియుండక, ఆయనను, మహిమగల దేవుని పోలియుందుము. ఆయన ఉన్నట్లుగా మనమాయనను చూచినప్పుడు మనమాయనను పోలియుందుము. ఆహా! ఆ ప్రేమ ఎంత పృధుపైనది. మనపక్షముగా ఆయన చూపు కృపాశక్తులకు మేరగలదా!

ఒక చిన్న బాలిక ఇట్లడిగెను. "మనము పరలోకానికి వెళ్లినప్పుడు నల్లగుంటామా? తెల్లగుంటామా?" తల్లి ఇచ్చిన జవాబేమనగా, "నల్లగానూ ఉండం, తెల్లగానూ ఉండం. ప్రభు యేసు క్రీస్తు ఏలాగుంటే మనము కూడా అలాగే ఉంటాము." అది సర్వసత్యము. అట్లుండునిమిత్తమే మనం మన సజీవుడైన రక్షకుని యొక్క మహిమను గూర్చి స్పష్టమైన దర్శనమును కలిగియుండవలెను. అపొస్తలుడైన యోహాను వెనుకకు తిరిగి ప్రభువును చూచినప్పుడు ఇటువంటి దర్శనమే పొందెను." ఆయన తలయు, తల వెంట్రుకలును తెల్లని ఉన్నిని పోలినవై ధవళంగా ఉండెను: ఆయన నేత్రములు అగ్ని జ్వాలలవలె ఉండెను. ఆయన పాదములు కొలిమిలో పుటము వేయబడి మెరయుచున్న అపరంజితో సమానమైఉండెను. ఆయన కంఠస్వరము విస్తార జల ప్రవాహముల ధ్వనివలె ఉండెను. ఆయన తన కుడిచేత ఏడు నక్షత్రములు పట్టుకొని ఉండెను. ఆయన నోట నుండి

రెండంచులుగల వాడియైన ఖడ్గమొకటి బయలు వెడలుచుండెను. ఆయన ముఖము మహా తేజస్సుతో ప్రకాశించుచున్న సూర్యుని వలె ఉండెను" (ప్రకటన 1:14-16). మనం ఎటువంటివారిగా నుండవలెనని ఆయన కోరుచున్నాడో, మనం తెలుసుకొను లాగున ప్రభువు తన్నుతాను యోహానుకు ప్రత్యక్షపరచుకొనెను. ఆ దినములలో విశ్వాసులు పడుచున్న హింసలను, శ్రమలను చూచి అపొస్తలుడైన యోహాను బహుగా అధైర్యపడిఉండెను. అనేకులు చెదరిపోయి యుండిరి. అనేకులు చెరలో నుండిరి. అనేకులు తమ సొత్తు నంతయు పోగొట్టుకొని యుండిరి. ఇంక అనేకులు భయముచేత సంతోష సమాధానములను కోల్పోయి యుండిరి. "నేనే గెలిచితిని" యని అపవాది తలంచెను. అయితే ఈ అనుభవములద్వారా విశ్వాసుల హృదయములలో పని జరిగించుచు, వారిని ఆయన తన పోలికకు మార్చుచుండెనను సంగతి అపవాది ఎరిగి యుండలేదు.

లోన జరుగుచున్న ఈ పని విషయము బోధకులమైన మేము అప్పుడప్పుడు మరచుచున్నాము. పెద్ద గుంపును చూచి మురిసిపోవుచున్నాము? ఒక చిన్న గుంపె కూడిన యెడల, వాక్యము చెప్పుటకు మనస్సు రావటంలేదు. ఉత్సాహము ఎగిరిపోవును. సంఖ్యలే మాకు ప్రధానం మిషనరీలు, పాస్టర్లు మోసపోవుట ఇట్లే, పెద్దసమూహములతోను, అనేకులు మతము పుచ్చుకొనుట ద్వారాను దేవుని మెప్పించగలము అని భావించుచున్నారు. అట్టి హాసంగా ఇంగ్లండు, అమెరికాలకు ఇట్లు రిపోర్టులు పంపుచున్నారు. "ఇంతమందిని మేము క్రైస్తవులను చేసి బాప్తిస్మం ఇచ్చియున్నాము. మాకు ఇంకను విస్తారంగా ద్రవ్యం పంపవలెను. వారు తొడుగుకొనుటకు బట్టలులేవు. ఉదయం, సాయంత్రం వారు భుజించుటకు వట్టి అన్నం, సాంబారు

మాత్రమే ఉన్నవి. నెయ్యిగాని, మాంసంగాని లేవు. అంతా బహు బీదలు. దయచేసి **మాకు** ఇంకను అధికంగా డబ్బుపంపుడి. ఇట్టివారే గ్రుడ్డివారు దేవుని పనిని పాడుచేసిన వారు. గుంపులు సంఖ్యలే వారికి కావలసినదంతయు. ఒక తల్లికి పాతికమంది బిడ్డలున్నారు అనుకొనుము. మొదటి బిడ్డ గ్రుడ్డి, రెండవ బిడ్డ మూగ, మూడవ బిడ్డ కుంటి. నాలుగవ బిడ్డ చెవుడు, ఇట్లు ప్రతి బిడ్డకు ఒక వికృతము ఉండెను. ఈ బిడ్డలవలన తల్లికి ఎంత సంతోషము కలుగును? మరియొక తల్లికి ఇద్దరు ముగ్గురు బిడ్డలు మాత్రమే ఉండవచ్చును. వీరు ఎట్టిలోపములేక ఆరోగ్యం, బలం కలిగియున్నారు. ఈ ఇద్దరిలో సంతోషించు తల్లి ఎవరు? సంఖ్యలనే ధ్యానించుచుండు వారు మేము "ఇంతింత మందికి బాప్తిస్మంను ఇచ్చితిమి"అని చెప్పుకొనవచ్చును. అయితే అంతమందిలోను ఆత్మీయంగా చెవుడు, గ్రుడ్డి, మూగ వారెందరున్నారు? మిషనరీలు, పాస్టర్లు, ఇట్టి పని ఏల చేయవలెను? ఏలననగా, వారు ప్రభువును చూడలేదు. ఈ కారణముచేతనే నేడు ఇండియాలో క్రైస్తవ పనియందు ఇంతగా ఆత్మీయ గొడ్డుతనమున్నది.

అపొస్తలుడైన యోహానుతో దేవుడు చెప్పినది ఏమనగా: "యోహానూ, నా ప్రజలయొక్క శ్రమలను, పేదరికంను, కష్టములను, పరీక్షలను చూచి, అధైర్యపడకుము. వీటిద్వారా వారి హృదయంలలో నేను చేయుకార్యంను చూడుము." బంగారం అగ్నిలో శుద్ధిచేయబడునట్లు, ఆ పరీక్షలద్వారా ప్రభువు తన ప్రజలను శుద్ధిచేయుచున్నాడు. ఇట్టి అంతరంగికకార్యమే ప్రభువు మేరలేని విలువ కలిగియున్నది.

## ఆయనే మన జ్ఞానము

ప్రకటన 1:14 లో మనము ఈ విధంగా చదువు

చున్నాము, "ఆయన తలయు, తలవెండ్రుకలును తెల్లని ఉన్నిని పోలినవై యుండెను". యోహాను తెల్ల వెండ్రుకలుగలిగిన తేజోవంతమైన ముఖమును చూచెను. కొంతమందికి వెండ్రుకలు నెరసియుండుట యిష్టం లేదు. వెండ్రుకలను నలుపుగా నుంచుటకు శ్రేష్టమైన తైలమును ఉపయోగింతురు. వెండ్రుకలకు రంగు పూయుటవలన తాము యౌవనస్థులుగా కనబడుచు సంతోషించవచ్చునని వారి యూహ, ప్రభువు వెండ్రుకను ఏల తెలుపుగా నుండెను? దానియేలు 7:13 చూడుము దానియేలు. "మహా వృద్ధుడగువానిని" చూచెను. అనగా ఆదినుండియున్నవానిని, యుగ యుగముల జ్ఞానము కలిగియున్నవానిని చూచెను. ఆ జ్ఞానమును ఈ తెల్లనివెండ్రుకలు తెలుపుచున్నవి. ఈయన "కాలములలో పూర్వమున్నవాడు." తనజ్ఞానమును మనకిచ్చుచున్నాడు. పాపమువలన మనం మందమతులము, బుద్ధిహీనులము అయితే, ఆయనను మన స్వంతరక్షకునిగా మనం గైకొనినప్పుడు ప్రభువైన యేసుక్రీస్తే మన జ్ఞానమగుచున్నాడు. కాగా రానున్న విషయముల నేమి, దేవుని రాజ్యమునకు సంబంధించిన విషయములనేమి గ్రహించుచున్నాము.

ఇప్పుడు మనప్రభువు చెప్పుచున్నదేమనగా, "అనేక ప్రవక్తలును, నీతిమంతులును మీరు చూచువాటిని చూడగోరి చూడకపోయిరి. మీరు వినువాటిని వినగోరి వినకపోయిరని మీతో నిశ్చయంగా చెప్పుచున్నాను" (మత్తయి 13:17). "దేవదూతలు ఈ కార్యమును తొంగిచూడగోరుచున్నారు" (1 పేతురు 1:12). ఇవి పరలోకులకేమి, ప్రవక్తలు, నీతిమంతులకు సహా మరుగుచేయబడిన విషయములు, నేడు ప్రభువైన క్రీస్తును వెంబడించువారికి ప్రత్యక్షపరచబడుచున్నవి. సజీవుడగు యేసుప్రభువు నా హృదయంలోనికి ప్రవేశించినప్పుడు, ఆయనే నా జ్ఞాన

మారెను. నాకు బైబిలు తెలిసియుండుట నా జ్ఞానము కాదు ప్రభువైన యేసుక్రీస్తుయొక్క సజీవసాన్నిధ్యమే నా జ్ఞానము. ఆయనకొరకే జీవించుచున్నాను; ఆయననే సేవింతును నేను. ఆయనను తెలిసికొనినకొలది మరింతగా ఆయన నా జ్ఞానమగు చున్నాడు. అందువలననే తన దర్శనమంతు యోహాను ప్రభువు యొక్క వెంట్రుకలు తెల్లని ఉన్నిని పోలినవై హిమమంత ధవళముగా నుండుటను చూచెను.

ఒక కుటుంబంలో ఒక శిశువు జన్మించినప్పుడు, చూడ వచ్చినవారు అడుగు మొదటి ప్రశ్న- "ఈ బిడ్డకు తండ్రి రూపమా, తల్లిరూపమా!" ఆ శిశువు ఇరువురునికూడ పోలి యుండును. ఎదిగినకొలది, ఆ పోలిక మరింత స్పష్టంగా కన బడును. ప్రభువైన యేసుక్రీస్తును మనహృదయములలో చేర్చు కొనినప్పుడు ఆయన కుటుంబంలోనికి జన్మించితిమి. అందువలన మనం ఆయనను పోలియుండవలెను. లేనియెడల క్రీస్తువాడవు అనిపించుకొనుటకు నీకు హక్కులేదు నీవు సాతాను బిడ్డవని పిలువబడవలెను.

దేవునివాక్యమును దయతో నమ్ముము; పశ్చాత్తాపపడి, నేడే ప్రభువైన యేసుక్రీస్తును నీహృదయంలోనికి చేర్చుకొనుము. అప్పుడు నీవు ఆయన బిడ్డవై ఆయనను చూతువనియు, ఆయన పోలికలలోనికి మార్చబడుదువనియు నిరీక్షించుచుందువు.

చివరగా అంతరముకూడ ఆయనను పోలియుందుము. ఎప్పుడనగా ఆయన రెండవరాకడలో ఆయనను చూచినప్పుడు. ఇప్పుడు భూమిమీదనుండగా మన హృదయంలోనికి ఆయనను చేర్చుకొనవలెను. "రక్షకుడు నా హృదయంలో నివసించుటకు వచ్చియున్నాడు" అని సత్యంతో, సంతోషంతో, నిర్భయంగా చెప్పగలవా? లేనిచో, ఇప్పుడే ఆయనను స్వీకరించుము. * *

# 6

# చూచి నేర్చుకొనుము

హెబ్రీ. 12:2లో యేసువైపు చూచుచు" అను ఈ మూడు చిన్నమాటలలో గొప్పమర్మము ఇమిడియున్నది. మనం మున్ముందుగా యేసుప్రభువును ఇప్పుడు చూడవలెననియు, అటు తరువాత ఆయనను చూచుచునే యుండవలెననియు, ఇహలోక మందేగాక నిత్యత్వమంతయును ఆయనను చూచుచునే యుండు మనియు ఈ మాటల భావము.

కెనడా దేశంలోని నయాగరా జలపాతమును గూర్చి వినియేయుందువు. ప్రపంచమందలి ఏడువింతలలో ఇది యొక టిగా ఎంచబడియున్నది. ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను చూచుటకు ప్రజలు వెళ్లునట్లు ప్రపంచంలోని అనేకభాగములనుండి ప్రజలు ఈ నయాగరా జలపాతమును చూడవచ్చుచుందురు. ఇదియొక సుందరమైన దృశ్యం. నయాగరా నది చీలి రెండు జలపాత ములుగా పడుచున్నది. దానికి ఒకవైపున అమెరికా సంయుక్త రాష్ట్రములును, రెండవ వైపున కెనడాయు నున్నవి. 1928 లో మేమొక అయిదుగురము కలిసి ఈ ప్రఖ్యాతిగాంచిన జలపాత మును చూడవెళ్ళితిమి. చూచుచు రెండుగంటలు గడిపినపిమ్మట నా స్నేహితులు నాతో ఏమనిరంటే; "జలపాతాన్ని చూడడం అయినది, ఇకచాలును. ఇకపోదాం పద." నేనిట్లంటిని. "ఎంద రెందరో నయాగరా జలపాతాన్నిగురించి చెప్పగా చాలా విని యుంటిమిగదా? ఇప్పుడు తీరా ఇక్కడికిరాగా, ఇంక కొంత చూచి వెళ్ళకూడదా?" అప్పుడు నాకిట్లు సమాధానం చెప్పిరి: "చూచుట అయినదికదా? నీళ్ళు క్రిందికిపడుతూఉన్నవి, అంతే. చూడడానికి ఇంకేమున్నది?" సాయంత్రమే వారు వెళ్ళిపోయిరి.

ఎక్కువ కాలముండినయెడల హోటలులో చాలా డబ్బు ఖర్చు చేయవలసియుండునని వారు తలంచిరేమో. నేను ఇంకను ఐదు దినములు అక్కడనేడండి, దినమునకు మూమ్మారు అనగా సూర్యోదయమున, మధ్యాహ్నమున, సూర్యాస్తమయమున ఆ జలపాతమును దర్శించుచుంటిని. ఏ పూటకు ఆ పూట అది క్రొత్తగా కన్పించెను. ఈ వింతదృశ్యమును నేను చూచినకొలది అది ఎంత సౌందర్యముగా నుండెనో తెలిసికొనుచుంటిని. అయి నప్పటికిని, నయాగరా జలపాతంయొక్క పూర్తిసౌందర్యమును ప్రశంసింపవలెనన్న శీతల, వేసవి మొదలైన అన్నిఋతువులలో వాటినిచూచి తీరవలెను. నయాగరా జలపాతమైతే దేవునిసృష్టిలో ఒక నలుసులాంటిది. దానిని గ్రహించుటకే ఇంత దీర్ఘకాలం కావలసియుండినయెడల మన సృష్టికర్తయైన ప్రభు యేసుక్రీస్తు యొక్క సౌందర్యమును గ్రహించుటకు నిత్యత్వము చాలునా? అట్టి సౌందర్యవంతుడు, అట్టి తేజోవంతుడాయన.

నీ స్వంత జీవితములోనో, నీ పరిచర్యయందో నీవు కృంగి, అధైర్యపడి, నిరాశచెంది యుండునప్పుడు ఈ రీతిగా ప్రార్థించుము: "ఓ దేవా, నీ కుమారుని మహిమనుగూర్చిన ఒక నూతనదృశ్యము నాకిమ్ము" అపొస్తలుడైన యోహాను ప్రభు వును అత్యంత సమీపంగా చూచుభాగ్యము కలిగియుండెను. ప్రభువును బహు నమ్మకంగా సేవించెను. ఏ ప్రశ్నయైనను ప్రభువును అడుగగలిగియుండెను. నిజంగా తనతలను ప్రభువు రొమ్ముమీద ఆనించగలిగియుండెను. ప్రభువు రూపాంతరము పొందుటను చూచెను. ప్రభువు తిరిగిలేచుటను, పిమ్మట ఆయన పరలోకమున కేగుటను చూచెను. ఇప్పుడైతే ప్రకటన గ్రంథ ములో యోహాను తన వృద్ధాప్యమందు సరికొత్తరీతిగా ఆయనను

చూచుచున్నాడు. ఆయన ప్రభువైన యేసుక్రీస్తే అని అతనికి తెలుసును. కావుననే, అయ్యా నీవు ఎవరవు?" అని అడుగుట అనవసరము. ఏలననగా, ఈ విధంగా వణకుచున్న ఒక స్వరం వినెను. "అల్ఫాయు ఓమెగయు నేనే. నేను మొదటివాడను, కడపటివాడను" (ప్రకటన 1:8, 18). మాట్లాడుచున్నవానిని చూచుటకు యోహాను వెనుకకుతిరిగి, తక్షణమే ప్రభుపాదముల యొద్ద పడి, "ఓ ప్రభువా, నీ వింత సౌందర్యవంతుడవనియు, ఇంత గొప్పవాడవనియు నేనెరుగనైతిని" అనెను. ప్రభువైన యేసుక్రీస్తుయొక్క అంగములను మరింత సంపూర్ణంగా తెలిసి కొనుటకు, అనగా ఆయన వెంట్రుకలు, పాదములు, హస్తములు, నోరు, ఆయన వస్త్రములు-వీటన్నింటియొక్క అర్థమును తెలిసి కొనుటకు చాలారోజులు పట్టును.

ఈసారి క్రొత్తరీతిగా మన ప్రభువు యోహానుకు ఏల ప్రత్యక్షము కావలెను? దీనికి సమాధానమిచ్చుట సులభమే. ఆయన యోహానుతో ఇట్లు చెప్పుచున్నాడు—"నీవు చూచునట్టి నా స్వరూపమును నా ప్రజలు దాల్చవలెనని నేను కోరుచున్నాను." అందువల్లనే ప్రభువుయొక్క జనులు ఆ కాలమందు అత్యంత శ్రమలలోపడి వెళ్ళవలసియుండెను. ఉదాహరణముగా మెరయుచున్న శుద్ధబంగారం నీకు కావలెనంటే ఆ బంగారమును కరగించి అగ్నిలో శుద్ధిచేయవలెను. కరిగిన బంగారము ఒక అద్దమువలె స్వర్ణకారుని ముఖమును ప్రతిబింబించు పర్యంతమును, స్వర్ణకారుడు అంతకంతకు ఎక్కువగా అగ్నికి వేడి ఎక్కించుచుండును. అతడు ఆ కరిగిన బంగారములో తన ముఖమును చూచుకొనగలిగినప్పుడే అది నిష్కల్మషముగా శుద్ధీకరింపబడియున్నదని తేలుచున్నది. ఇదేవిధంగా ప్రభువైన

యేసుక్రీస్తుయొక్క మహిమ మనలో ప్రత్యక్షమగునంత వరకు శ్రమలనెడు అగ్నితో మనం పుటము చేయబడవలసియున్నది.

ఇంతకు పూర్వము ప్రభువుయొక్క వెంట్రుకలనుగూర్చి కొంత చెప్పుకొంటిమి. ఇప్పుడు ఆయన నేత్రములనుగూర్చి కొంత చెప్పుకొందము. ఫ్రాన్స్ దేశపు చక్రవర్తియగు నెపోలియన్‌నుగూర్చి ఒక కథ చెప్పబడియున్నది. అతని సైన్యంలో ఒక భాగమునకుచెందిన భటులు చక్రవర్తిమీద తిరుగుబాటు చేయుచుండిరి. నెపోలియన్ ఒక డేరానువేసికొని కూర్చుండి ఒక ఉత్తరువు నిచ్చెను." ఆ తిరుగుబాటుచేయు భటులను ఒక్కొక్కనిగా నా డేరాలోనికి తెండి." చక్రవర్తి ఆజ్ఞానుసారముగా ఒకని తరువాత నొకడు ఆయన యెదుటికి తేబడిరి. నెపోలియన్ నోటితో నొక మాటయైనను పలుకలేదు. "నీవు నేరముచేసి యున్నావు" అనియైనను చెప్పలేదు. కూర్చుండినవాడై, ఒక్కొక్కడు తనఎదుటకు రాగా, వారిని తలనుండి కాలువరకుచూచి పంపివేసెను. చక్రవర్తి కంటిచూపే ఆయన కోపముతో మండుచుండుటను వారికి తెలిపెను. "ఇక లోబడనిచో ఆయన మనలను శిక్షించును," అని ఆ భటులు చెప్పుకొనుచు, ఆ నాటినుండే తిరుగుబాటు మానివేసిరి.

అమెరికాలో ఒక ధనికుడుండెను. ఒకటి తన స్వంత కన్ను మరొకటి గాజుకన్ను. ఈ గాజుకన్ను ఎంత చమత్కారముగా చేయబడియుండెననగా, ఏది నిజమైనకన్నో, ఏది గాజు కన్నో, ఎవరును కనుగొనలేకపోయిరి. ఒక నాడు అతడు ఒక చిన్నబిడ్డను పిలిచి, "పాపా నా అసలుకన్ను ఏదో చూపించు" అనెను. ఆ బిడ్డ గాజు కన్నును వెంటనే తెలిపివేసెను. "నీకేలాగు తెలిసినది?" అని అతడు అడుగగా. "ఆ

కంటిలో ప్రేమ లేదు" అని ఆ బిడ్డ ప్రత్యుత్తరమిచ్చెను. ఆ గాజుకన్ను మెరయుచుండెనేగాని, దానిలో ప్రేమ లేకుండెను. దేవుని వాక్యమందు ప్రభువైన యేసుక్రీస్తుయొక్క నేత్రములను చూచుచున్నాము. అవి ప్రేమతో, దైవప్రేమతో, నిత్యమైన ప్రేమతో నిండుకొనియున్నవి. యిర్మీయా 31:3లో 'శాశ్వత మైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడు వక నీయెడల కృపచూపుచున్నాను. ప్రభువైన యేసుక్రీస్తు నేత్ర ములలోనున్న అగ్ని నిన్ను భయపెట్టుటకు కాదు. నీవు పరి శుద్ధుడవుగానుండవలెనని దేవుడు కోరుచున్నాడు. నీలోప్రవేశింప వలెనని ఆయన కోరుచున్నాడు. అయితే పరిశుద్ధులముగా నుండుట ఎట్లు? ప్రభువైన యేసుక్రీస్తుయొక్క నేత్రములలోనికి చూచుటవలన మరియు ఆయనను ముఖాముఖిగావీక్షించుటవలన. ప్రారంభమందు ఇది మనకు అంత ఇంపుగా నుండదు. ఎందు కంటే అగ్నికాల్చును, నీలోనున్న పాపపు మష్టునంతటిని దహించివేయును. కాని నీవు ఆయన నేత్రములలోనికి మానక చూచుకొలది ఆయన దైవప్రేమ నీలో పోయబడును.

ఇవే నేత్రములనుగూర్చి 2వ దినవృత్తాంతములు 16:9లో ఇట్లు చదువుచున్నాము- "తనయెడల యథార్థహృదయముగలవారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోక మంతటా సంచారం చేయుచున్నది." దేవునిప్రేమ ఎంత గొప్ప దనగా, ఆయనకన్నులు మనపక్షమున పనిచేయుచు లోక మంతటా సంచారం చేయుచున్నవి. తనబిడ్డను కనిపెట్టుచున్న తల్లియొక్క నేత్రములవలె ఆయన ప్రేమగల కన్నులు సంచా రముచేయుచున్నవి. తల్లి వంటగదియందు పనిచేయుచుండినను, బిడ్డ అపాయంలో పడునేమోయని, ఆ బిడ్డపై కన్ను వేసియే యుండును. ఆయన చిత్తము జరిగించుచు, ఆయనఎడల మనం

యథార్థంగా నుండినచో, మనకు అనేకమంది స్నేహితులను, సహోదర సహోదరీలను ఇచ్చుటకును, మనకు అనేక ఉపకారములు చేయుటకును, ఆయనకన్నులు మనపక్షమున సంచారం చేయునని మనమెరుగుదుము.

తిరిగి ఈ రీతిగా చదువుచున్నాము— "మిమ్మును ముట్టినవాడు తన కనుగుడ్డును ముట్టినవాడు" (జెకర్యా 2:8). కన్ను చాలాసున్నితమైన అవయవము. శరీరమందు ఏ భాగమునైనను నీవు తాకవచ్చును. కన్నులుమాత్రము:-"నన్ను తాకవద్దు, నన్ను తాకవద్దు." అనును. దేవుడు ఇట్లేఅనుచున్నాడు— ఎవడైనను నిన్ను ముట్టినయెడల,"అతనిని ముట్టవద్దు. అతడు నా బిడ్డ, నాసొత్తు అని చెప్పును." మనం ఆయనకు ఎంత ప్రశస్తంగా నున్నామంటే, ఏశక్తివలనగాని ఆయన మనకు హాని కలుగనియ్యడు.

కీర్తనల గ్రంథం చెప్పునదేమనగా, యెహోవా దృష్టి నీతిమంతులమీద నున్నది. ఆయనచెవులు వారిమొరలకు ఒగ్గియున్నవి (కీర్తన 34:15) మనలను రక్షించునిమిత్తం ప్రభువు తనదృష్టిని మనపై నుంచును. ఇంకను కీర్తనలు 32:8లో మనం ఈ రీతిగా చదువుచున్నాము— 'నీకు ఉపదేశం చేసెదను. నీవు నడవ వలసిన మార్గ నీకు బోధించెదను. నీమీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పెదను." కన్నులతో నీవు ఎన్నో సంగతులు చెప్పవచ్చును. ఒకనాడు నేనొక ఇంటికి వెళ్ళితిని; ఇంటి యజమాని—"దయచేసి కొంచెం టీ పుచ్చుకొని వెళ్ళండి" అనెను. "మీకు థాంక్స్" అంటిని. అతనిభార్య వంటగదిలోనికి వెళ్ళెను. మేము కొంత కనిపెట్టితిమి.పిమ్మటఆమెవెలుపలికివచ్చి తలుపు వెనుకనుండి భర్తనుచూచి, కంటితో ఏవేవో సంజ్ఞలు

చేసెను. ఆ కంటిభాష ఏదనగా- ఇంటిలో పాలులేవు, నన్ను మెల్లగా పంపించివేయమని భర్తకు సూచించుట. కంటితో ఎంతో చెప్పవచ్చును. ప్రభువు చెప్పునదేమనగా, "నీమీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పెదను. నీ వెచ్చటకు వెళ్ళవలయునో నేను తెలుపుదును."

ప్రభువును మనము చూచుకొలది, ఆయన కన్నులనుండి మనం పొందు వర్తమాన మిదియే.

❋❋

# 7
# ఆయన నిన్ను వెదకుచున్నాడు చూచి రక్షణ పొందుము

సువార్తలందు రెండు చిన్న వచనములు గలవు. ప్రభువైన, యేసుక్రీస్తు యావజ్జీవిత సంకల్పం ఈ రెంటిలోనే క్లుప్తముగా ఇమిడియున్నది. ఒకటి: లూకా 19:10 "నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను," రెండవది: యోహాను 10:10 కడపటి భాగము- "వారికి జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని." మనకు తెలియకుండానే దేవునివాక్యము ప్రపంచమంతటవెదలుచున్నది. నీవు ఎక్కడకు వెళ్ళినను దేవునివాక్యం కొరకు ఆకలిదప్పులు కలిగియుండుట, దేవుని తెలిసికొనవలెనని నీకుండినయెడల, యిర్మీయా 29:13లో చెప్పబడినట్లు నీవు ఆయనను కనుగొందువు. "మీరు నన్ను వెదకినయెడల, పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేసిన యెడల మీరు నన్ను కనుగొందురు."

ఆయనను కనుగొనుటతో, సమృద్ధి జీవము మనకిచ్చుటకు ప్రతి ఏర్పాటు ఆయనే చేయును. అప్పుడు ఆయనతోకలసి ఆయన జత పనివారముగా మనం పని చేయవలసియున్నది. ఎక్కడో, ఎప్పుడో తిరిగి జన్మించితిమి అని చెప్పుకొను విశ్వాసులనేకులు ఈ సమృద్ధి జీవములేనివారై యున్నారు. మొదటి ప్రపంచ యుద్ధ మందు అనేకయుద్ధభటులు గాయాలుపొందియుండిరి. ఒకప్పుడు ఈగాయాలు పొందినవారిలో 8గురి స్థితి బహు ఘోరమైయుం డెను రెండు కాళ్లనుపోయెను. రెండుచేతులును పోయెను. రెండు కండ్లును పోయెను. జీవన్మృత్యులే వీరు. వారిని ఎక్కడకు తీసి కొని పోవలెనన్న గంపలలో వేసికొని తీసుకొనిపోవలెను. గరిటి తోనో, గొట్టముతోనో, వారికి ఆహారము పట్టించవలెను. అనేక మంది విశ్వాసుల ఆత్మీయస్థితికూడ ఇంత ఘోరమే. తిరిగి జన్మించియున్నాము అనుచున్నారే గాని సంవత్సరముల కొలది వారు ఆత్మీయంగా మూగివారే, చెవిటివారే. అట్టి విశ్వాసులు రోగులన్నమాటే; దేవునికొరకు పనిచేయుటకు శక్తిలేనివారు అయితే ప్రభువు పలికినమాటయే సత్యం. "వారికి జీవం కలుగు టకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని." "సమృ ద్ధిగా" అనుదాని భావము నిండి పొర్లి పారుచుండుట.

ప్రభువు కడపటిసారి యెరూషలేముకు ప్రయాణము అగు చుండగా చెప్పిన చివరిమాటలను పఠింపుము. సమస్తమును ఆ మాటలలో బయలుపరచుచున్నాడు. నశించినదానిని వెదకి రక్షిం చుటకు ఆయన ఎట్లు సంచరించుచుండెనో అను విషయమును, నశించిపోవుచున్న అనేకులకు తమ్ము ప్రేమించు రక్షకుడు, మంచి గొఱ్ఱెలకాపరి, ఎట్లు తమ్ము వెదకుచుండెనో తెలియుట లేదు. వారిని రక్షించుటకు ఎన్నెన్నో సాధనములను ఉపయో

గించుచున్నాడు. ఒకప్పుడు వారికొరకు ప్రార్థనచేయు భారము స్నేహితులమీద, పరజనులమీదకూడ వేయుచున్నాడు. తన యొక్క ఏర్పాటును గ్రైకొనువరకు ఈ నశించువారు చేయుచున్న ఎర్పాట్లన్నిటిని మార్చివేయుచున్నాడు.

చాలాకాలము వరకు నేనొక వైద్యుడను కావలెనని నా కోరిక. అందుకే సైన్సు తీసుకొంటిని. దానిలో మంచిమార్కులు కూడా సంపాదించుచుంటిని. వైద్యవిద్యా కళాశాలలో తప్పక నాకు సీటు దొరకునని నాకు నిశ్చయత యుండెను. అప్పటి పంజాబులోని లాహోరులో నేను చదువుకొనుచుంటిని. 1925లో మా తండ్రి తన యంత్రశాలకు, ఏవో కొన్ని యంత్రములు కొనుటకు లాహోరుకు వచ్చిరి. ఆ యంత్రములు అమ్మువారి ఎజెంట్లవద్దకు తనతో నన్నునూ తీసికొనిపోయిరి. వారితో మా తండ్రి వ్యవహారము కుదురునంతకాలమును నేను అదంతయు గమనించుచుంటిని. అప్పుడప్పుడు ఆ ఏజెంట్లను కలసికొని, ఆ యంత్రములు మాకు ఎప్పుడు అందునో విచారించుచుండుమని నాతో చెప్పి ఆయన స్వగ్రామమునకు తిరిగి వెళ్ళిపోయెను. ప్రతి వారమువెళ్ళి విచారించుచుంటిని, "మా తండ్రి యంత్రాలకు ఇచ్చిన ఆర్డర్ ఏమైనది?" అని నే నడుగుట, "ఇంకా ఏమి కాలేదు" అని వారు ప్రత్యుత్తరమిచ్చుట, ఇట్లే కాలం గడుపు చుండెను. వీరంతా మోసం చేయుచు మా తండ్రిని మోసగించు చుండిరని ఒకనాడు కనుగొని, వారివిషయము ఆయనకు తెలుపుచు; వారిని నమ్ముకొని పెద్దనష్టం పడవద్దని తంతివార్త పంపితిని. అప్పుడు ఈ తలంపు నాకు కలిగెను. "ఎంతవరకు వీరు మా నాన్నను మోసగించెదరు? నేనొక ఇంజనీర్ అయ్యానంటే నేనే ఆయనకు సహాయం చేయగలను కదా" సార్గోదాలోని

మా తండ్రి యంత్రశాలయందు నేను పనిచేయు నిమిత్తం ఇంజనీరింగ్ చదువుటకు ఇంగ్లండు వెళ్ళవలసియుండెను.

ఇంగ్లండులో నేను డెన్మార్క్‌హిల్ అనబడు స్థలమందుంటిని. ఆదివారములు టెన్నిస్ ఆడుటకువెళ్లి సాయంకాలం తిరిగి వచ్చి క్లబ్బులో సారా త్రాగుచు, ఇంకను వేరే పనికిమాలిన కార్యములుచేయుచు, సమయమంతయు వ్యర్థపరచు చుంటిని. ఒకానొక రాత్రి క్లబ్బునుండి పూటకూలి ఇంటికి తిరిగివచ్చి, నిశ్శబ్దంగా ఎదుటి తలుపుతెరచి లోన ప్రవేశించితిని. డ్రాయింగు రూములోనుండి ఏదో సంగీతం వినబడెను. నేనుండిన యజమానురాలు పియానో (piano) మీద ఏదో మంచి కీర్తన వాయించుచుండెను. కీర్తనలు నాకు నచ్చవు. నాట్యముల స్వరములే నేను యిష్టపడునవి. మిసెస్ కాంప్, (Mrs. Camp) అనగా, మా యజమానురాలు, నేను ఇంటికి వచ్చినది గ్రహించి నాతో ఇట్లనెను "ఏమండోయ్ : ఈ గదిలోకి దయచేసి, నా సంగీతం కొంత వినండి." ఆమెను మెప్పించుటకు వెళ్లితిని. "మీకు సంగీతం ఇష్టమేనా?" యని అడిగెను. మర్యాద కొరకు "ఇష్టమేనమ్మా, అంటిని ప్రతి ఆదివారం తాను పియానో వాయించు సమయమున, ఆ డ్రాయింగ్ రూము తలుపు తెరచి యుండెడిది. రక్షణనుగూర్చి, బైబిలునుగూర్చి గాని ఒకముక్క నాతో ఎన్నడు సంభాషించలేదు. ఆమె చాలా దయగల స్త్రీ. నేను త్రాగుడు, నాట్యములలో సమయం వృధాపరచుట, ఆమె కెంతో కష్టముగానుండి, నాకొరకు ప్రార్థన చేయుచుండెనని తలంచుచున్నాను. డ్రాయింగ్ రూముకు నేను వెళ్ళి తన సంగీతము వినునట్లు చేయుటకు, నాకు ఆదివారములలో చక్కని పుడ్డింగ్ (Pudding) అనగా ఒక రకమైన పిండివంటను నా

కిచ్చుచుండెను. లోపలికి రమ్మని నన్ను పిలిచినప్పుడు, నాలోని తలంపులిట్లుండెను- "వెళ్ళకుంటే ఆ పుడ్డింగ్ నాకు దొరకదు." ఆ పిండివంటకొరకు ప్రతి ఆదివారం డ్రాయింగ్ రూములోనికి వెళ్ళుచుంటిని. ఆ దినములలో నేను నాస్తికుడను. ఏ మత అధికారమునకుగాని లోబడనివాడను. పరిశుద్ధ గ్రంథమును ద్వేషించేవాడను. అట్టినన్ను తనయొద్దకు ఆకర్షించుటలో దేవుడు ఈమెను ఉపయోగించెనని ఇప్పుడు తెలిసికొనియున్నాను. 1919 లో బైబిలును ముక్కలు ముక్కలుగా చింపివేసితిని; అయినప్పటికిని విడువక వెదకుచు వచ్చినదేవుడు ఎంతటి కృపాసాగరుడో!

ఒక నాడు నేను లండన్‌లో నా కాలేజికి వెళ్ళగా అక్కడ నోటీస్ బోర్డు (Notice Board) మీద ఒక పెద్ద ప్రశ్నగుర్తు కనబడుట చూచి దాని క్రింద వ్రాయబడిన ఈ మాటలు చదివితిని— "ఈ సంవత్సరము వేసవి విరామము కెనడాలో ఎందుకు గడపకూడదు?" వానివివరములు తెలిసికొన గోరితిని. వారు చెప్పిన విషయంలు ఇవి: పట్టా పరీక్షలో గెలిచినవారిలో ఒక పాతికమంది కెనడా వెళ్ళుచుండిరి ఆరు వారములు పొలములలో పనిచేసి కొంత పైకము గడించి, అక్కడనుండి వేరే స్థలములు దర్శింపబోవుట వారి ఏర్పాటైయుండెను. ఆ పార్టీతో నేనుకూడ పోదునని నా పేరు ఇచ్చితిని. దానిని దాఖలు చేసిరి. కొంతకాలమైన పిమ్మట వారు నా కేమి వ్రాసిరనగా, "ఇంగ్లండులో నిన్ను దయగా చూచినట్లు, కెనడా దేశస్థులు నిన్ను చూడరేమో గనుక నీవు కెనడా వెళ్లుట క్షేమము కాదని సలహా ఇచ్చుచున్నాము. "కారణమేమనగా ఆ దినములలో పశ్చిమ కెనడాయందు ఆ దేశస్థులు భారతీయుల యెడల స్నేహభావము కలిగియుండలేదు. "మీరు మీతో రానివ్వకుంటే, నేనే బయలుదేరి వెళ్లుతాను.

ప్రయాణము చేయుట నే నెరుగుదును"అని ప్రత్యుత్తరము ఇచ్చితిని. వారు తిరిగి యిట్లు వ్రాసిరి: "పంతగించి నీవు వచ్చిన యెడల అక్కడ నీకేమైనను అవమానము కలిగినచో మమ్ము నిందించవద్దు. వారు నీ మనస్సు నొప్పింపవచ్చును. లేక నీవు ఉండుటకు స్థలం ఇవ్వకపోవచ్చును. అప్పుడు నాలో నేనిట్లను కొంటిని: "వాళ్లకంటే నే నేమీ తక్కువ కాదని ఈ తెల్లవాళ్లకి చూపించాలి. వారేమిచేస్తే నేనుకూడ అదేచేస్తాను. చుట్టలు కాలుస్తారా? నేనుకూడా కాలుస్తాను. త్రాగుతారా? నేను కూడా త్రాగుతాను. డాన్స్ చేస్తారా? నేను కూడా డాన్స్ చేస్తాను. మాటలాడుతారా? నేను కూడా మాటలాడుతాను. ఆ ఉత్తరం వారు నాకు వ్రాసినందుకు, వాళ్ళకంటే నేనేమి తక్కువవాడను కానని చూపించితీరాలి." ఇదంతయు మీకేల చెప్పుచున్నా ననగా, ఇటువంటి చిన్న పరిస్థితులను కూడ తన యొద్దకు మనలను రప్పించుకొనుటకై దేవుడు ఎట్లు ఉపయోగించుచున్నాడో మీరు చూడగలందులకు.

1928వ సంవత్సరములో మేము లివర్ పూల్ నుండి బయలు దేరితిమి. అప్పుడు ఓడలో ఒకప్రకటన చూచితిని. అది వారం 10గం॥కు భోజన శాలయందు క్రైస్తవ ఆరాధన జరుగునని అది తెలిపెను. ఎన్నడైనను నేను ఒక క్రైస్తవ ఆరాధనకు వెళ్ళి ఎరుగను. బైబిలును గూర్చి ఏమియు తెలియదు. క్రైస్తవ మతము ఏమిటో తెలిసికొనవలెనను జిజ్ఞాస అంతకంటె లేదు. అయితే, వారు నాకు వ్రాసిన ఆ యుత్తరము వలన నాకు కలిగిన రోషమునుబట్టియే వారు ఆరాధనకు వెళ్లిన యెడల నేను కూడ వెళ్లుదునని పంతగించి వెళ్లితిని. లేకుంటే వాళ్ళ వాడను కాను. నా మనస్సులో ఇట్లు తలపోసితిని: వాళ్ళతో కలసి సారా

కొట్లకు, డాన్సింగ్ హాలులకు, అపమానపు గృహాలకు నేను వెళ్ళ లేదా? ఇప్పుడు వాళ్ళతో ఇక్కడికి వెళ్ళితేనేమి? ఈ క్రైస్తవులు చేసే పూజ ఎలావుంటుందో చూడాలి. అందులో తప్పేముంది?" నేను వెళ్ళి వెనుకవైపు కూర్చుంటిని. కూటము ప్రారంభించిరి. వారు లేచి నిలిచినప్పుడు నేను కూడ లేచి నిలిచితిని. వారు కూర్చున్నప్పుడు నేను కూడ కూర్చుంటిని. ఒకతను ఎవరో బోధ చేయనారంభించగా నేను నిద్రపోతిని.

ఈ క్రైస్తవ ఆరాధన నాకేమియు నచ్చలేదు. "ఈ తెల్లవారు దేవుని ఏలాగు సేవిస్తారు? వాళ్ళకు తెలిసినదంతా మోటారుకార్లు, విమానాలే! మన భారతీయులైతే దేవుని తెలిసికొన్నవారు. మనకు ఎన్నో ప్రాచీన మత గ్రంథాలుఉన్నవి." ఈ తలంపులలో నాకు నిద్రవచ్చివేసింది. కూటము ముగియునప్పుడు అందరు మోకరించి ప్రార్థించుచుండిరి. "ఇందులో మట్టుకు, వాళ్ల చేస్తున్నది నేను చేయను. వాళ్ల నా దేశస్థులు కారు. నేను మోకరించను." కూర్చుండినవాడను అట్లేయుండి, ఇటు, అటు అన్నివైపులు చూచుచుంటిని. అప్పుడొక తలంపు వచ్చెను. "ఇది బాగా లేదు. అందరు మోకాళ్ళ మీద ఉండే, నేను కూడా ఉండాలి. ఇష్టం లేకుంటే లేచి వెళ్లిపోవాలి." నేను ఎన్నో హిందూ దేవాలయములకు వెళ్లియుంటిని. అభిమానంతో నా పాదరక్షలను తీసి వేసియుంటిని. హిందూ దేవాలయంలకు, ముస్లిముల మసీదులకును నేను మర్యాద చూపగా, ఈ కూటంలో నేను మర్యాద చూపకూడదా యని తలచి, నా జాతి మత గర్వమును భంగపరచి మోకరించితిని. తక్షణమే, ఏదో దైవ శక్తి నా మీద పడుచున్నట్లుకాగా, నా శరీరం వణకుచుండెను. నా నోట నుండి ఈ విధంగా వెడలెను: "యేసు నాథా, నీవు జీవించు

చున్న క్రీస్తువని ఎరుగుదును. నమ్ముచున్నాను." తిరిగి, తిరిగి "జీవించుచున్న క్రీస్తు, జీవించుచున్న క్రీస్తు" అను మాటలు వచ్చుచుండెను. కెనడాలో నేను మూడు మాసము లుంటిని. అక్కడివారు అమితమైన ప్రేమ నాకు చూపిరి. అందువలన తిరిగి కెనడా పోవలెనను ఆశ నాలో కలిగెను.

1929లో తిరిగి కెనడా వెళ్ళితిని. ఈసారి నాఇంజనీరింగ్ కొరకు. అప్పుడు నేనుండినది వై. యం. సి. ఏ. లో ఒక మేడ గదియందు. ఒక బ్యాంక్ మేనేజరుగా నుండిన హాన్సన్ అను నామము గల ఒక యువకుడు సహితం ఆ వై.యం.సి.ఏ. లోనే బసచేసి యుండెను. అతని ముఖము ఎంతో కళ కలిగి మెరయు చుండెను. "హాన్సన్‌గారూ, మీ జీవితంలో మీకు అత్యంత సంతో షము కలిగించిన అనుభవము ఏమి?" ఇదే ప్రశ్న మా ప్రొఫె సర్లను, విద్యార్థులను, స్నేహితులను, అడిగి అనేక జవాబులు పొందియుంటిని. హాన్సన్‌గారు చెప్పినదేమనగా, "నేను క్రీస్తును కనుగొనడమే, నా కత్యంతఆనందం కలిగించిన అనుభవము." "నాకు అర్థం కాలేదు." అంటిని. "నేను క్రీస్తును తెలుసుకొన్న ప్పుడే" యని అతడు జవాబిచ్చి "క్రైస్తవులనబడేవారందరుకూడ నిజమైన క్రైస్తవులే అని అనుకోవద్దు. అనుభవముద్వారానే తప్ప నిజమైన క్రైస్తవులం కాలేము" అని చెప్పెను. అప్పటికికూడ ఆయనమాటల నాకు అర్థం కాలేదు. అయితే, ఒకటి మాత్రం ఎరుగుదును, ఎప్పుడుచూచినను ఎంతో సంతోషంగానున్నాడు; ఆ ముఖం మీద ఆనందం, ప్రకాశం కనబడుచున్నవి. ఇతరుల కును, ఇతనికిని ఎంతో భేదముండెను. ఇంకొకమారు ఆయనను కలిసికొని, "హాన్సన్‌గారు, మీ బైబిలు కొంత చదవడానికి ఇవ్వండి" అంటిని. "బైబిలు ఇమ్మంటున్నారేమి? మీ భారతీయు

లకు బైబిలంటే యిష్టముండదని నేను వింటిని'' అని అనెను. అప్పుడు నేనిట్లు ప్రత్యుత్తరమిచ్చితిని: అది సత్యమే నాకుకూడా బైబిలంటే ఇష్టం లేదు. 1919లో నాకొక బైబిల్ ఇచ్చిరి. ఒక్కొక్క పేజీనికూడా ముక్కలు ముక్కలుగా చింపివేశాను. అయితే యేసు జీవముగల క్రీస్తని ఒక సంవత్సరం నుండి నాకు నమ్మకం కలిగినది. అందుకు ఆయనగురించి ఇంకా తెలుసుకోవాలని ఉన్నది" అనిచెప్పగా, జేబులో ఉంచుకొను నూతన నిబంధన ఒకటి తన స్వంతది తీసి నాకిచ్చెను.

ఈ నూతన నిబంధన చదువ నారంభించి, రాత్రి 3 జాములవరకు చదువుచునేయుంటిని. మత్తయి సువార్తను చదివినపిదప ఇట్లనుకొంటిని: "లోకంలో పేరుపొందిన కవులు వ్రాసిన పేరుపొందిన పుస్తకాలు నేను బి.ఎ. తరగతిలో చదివి తినిగాని, ఈలాంటి పుస్తకం ఎప్పుడూచదువలేదు. భాష, శైలి, ఏదిచూచిన ఈ పుస్తకమే ప్రత్యేకంగా కనబడుచున్నది''. ఇది సాధారణమైన పుస్తకం కాదని నేను ఒప్పుకొనవలసియుండెను. అది దేవునిగ్రంథం. ఎంతో భయభక్తులతో ప్రతివచనం చదువు చుంటిని. మూడవనాడు యోహానుసువార్త 3వ అధ్యాయం 4వ వచనం చదివితిని. "నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." నా గదిలో ఎవరును లేనప్పటికిని అకస్మాత్తుగా ఆగదిలో దైవ సాన్నిధ్యం ప్రసన్నమైనట్లు నేను తెలుసుకొంటిని. "నీతో.... చెప్పుచున్నాను, నీతోచెప్పుచున్నాను'' అనుమాటలు తిరిగి తిరిగి వినబడుచుండెను. నామనస్సులో ఇట్లనుకొంటిని! "ఇది మంచి పుస్తకమే, అయితే ఇది ఐరోపా, అమెరికావాళ్ళకే వ్రాయబడి యున్నది. మనహిందువులకు వేరే పుస్తకాలున్నవి" అయితే ఆ స్వరంఇట్లనెను: ''అలాగు చెప్పవద్దు: నేను నీతోచెప్పుచున్నాను;

ఈ పుస్తకం నీకే." ఇప్పుడు ఇట్లంటిని: "ప్రభువా! ఈ పుస్తకం నాకైతే, నేను ఘోరపాపిని, ఎందుకంటే దానివిషయం నాకేమి తెలియక ఉండినందుకు దానినిచించి ముక్కలు చేసితిని." అక్కడే ఆ క్షణమే మోకాళ్ళమీద పడితిని. నాపాపములన్నియు నా యెదుటకు వచ్చెను. నా శరీరం మీద పాపం యొక్క గుర్తులను చూచితిని. నా శరీరమంతా నలుపే; అంతా మలినమే. ఆ దుర్గంధము నాకు కొట్టుచున్నది. "నీవు చూచుచున్న మచ్చలు, నీకు కొట్టుచున్న దుర్గంధము నీ పాపమువలనే" అని ఆ స్వరం తిరిగి చెప్పెను. నాగురువులకు కనబడనియ్యక, నా జననీ జనకులుగాని, స్నేహితులు, ఇరుగు పొరుగులుగాని చూడకుండా ఎంతో చమత్కారంతో అంతవరకు నేను కప్పియుంచిన పాపంలన్నియు నా కండ్లముందు నిలిచియున్నవి. అవన్నియు బయటకు తీయబడినవి. అప్పుడు ఇట్లంటిని: "అవును ప్రభువా నేను ఘోరపాపినే. నా పాపములు ఒప్పుకొనుచున్నాను. వాటినిబట్టి చాలా దుఃఖిస్తున్నాను." నేను అధిక మనోబాధ పడుచుంటిని. నేను డబ్బు కలిగియుంటినిగాని నాకు శాంతి యుండలేదు. విద్య కలిగియుంటినిగాని నా జీవితమంతా అపజయమే. "ప్రభువా నావంటివాడు బాగుపడుట సాధ్యమా!" యని అడిగితిని. అప్పుడు ఆస్వరం ఇట్లనెను: "ఇది నీ కొరకు విరువబడిన నా శరీరము. ఇది నీ పాపక్షమాపణ కొరకు చిందించబడిన నా రక్తము వలనైన క్రొత్త నిబంధన." "ప్రభువా, ఈ మాటలు నా గ్రహింపుకు మించిఉన్నవి. కాని, అర్థము తెలియకున్నను నేను నమ్ముచున్నానని చెప్పితిని." ఆ స్వరము తిరిగి ఇట్లువచ్చెను; "నా కుమారుడా నీ పాపములు క్షమింపబడియున్నవి.'"

రక్షణ అంటే ఏమిటో, తిరిగిజన్మించుట అంటే ఏమిటో, నీతిమంతులుగా తీర్చబడుట అంటే ఏమిటో, ఆ కాలమున నా

కేమియు తెలియదు నేను తెలిసికొనినది ఒక్కటే— యేసు నాథుడు నా పాపముల కొరకు మరణించియుండెను. నా పాపం లన్నింటిని క్షమించివేసియుండెను. వెంటనే చుట్ట,సారా,సినిమా, దుష్టస్నేహితులు, ఈ సమస్తం మీద నాకుండినకోరిక మాయమై పోయెను దేవునివాక్యం కొరకు నాకెంతో ఆకలికలిగియుండుట కనుగొంటిని. దినమంతయు బైబిలుపట్టుకొని చదువుచుంటిని. మొదటినుండి చివరివరకు మూడువారములలో చదివివేసితిని. రెండవమారు, మూడవమారుకూడ చదివితిని.

ఆ కాలమందు నాకు ముక్కులోను. కంఠములోను ఏదో జబ్బు బహు తొందర కలిగించుచుండెను. అప్పటికి 12 సంవత్సరములుగా దీనితో బాధపడుచుంటిని. ఎన్నిమందులు సేవించినను, ఎంతమంది వైద్యులదగ్గరకు పోయినను, స్వస్థత పొందకుంటిని. ఒకనాడు హెబ్రీ. 13:8 చదివి ఇట్లు ప్రార్థన చేసితిని: "యేసుప్రభువా, నీవు నిన్న, నేడు, యుగ యుగములకు ఒక్కటేరీతిగా ఉన్నావు. ప్రభువా నీవు ఒక్కటే రీతిగా ఉన్నావు, అని నమ్ముచున్నాను, దయతో నా ముక్కును గొంతుకను తాకవా?" ప్రార్థన అయినవెంటనే పరుండి నిద్రించి తిని. మరునాటి ఉదయం లేచినప్పుడు, సంపూర్ణ స్వస్థతపొంది యుంటిని. ఇది సంభవించి 42 సంవత్సరములు అయినది.

ఆ దినములలో ఒక ఆదివారం ఉదయమున ఆరాధన తీరినతర్వాత ఫ్లిన్ (Flinn) అను పేరుగల ఒక సత్ క్రైస్తవుని కలిసితిని. ఆయన రైల్వేపోలీసుగా పనిచేయుచుండెను. ఎత్తయిన బలాఢ్య శరీరుడు. ఆయన నాతో షేక్‌హాండ్స్ (Shake hands) ఇచ్చినప్పుడు నాచేతి ఎముకలను పిండిచేసినట్లాయెను. "బ్రదర్ ఎందుకు ఇండియాకుపోయి సువార్త ప్రకటించ

కూడదు?" అని ఆయన నాతో అనెను. నే నిట్లు ప్రత్యుత్తర మిచ్చితిని: ప్లీన్‌గారూ, నేను ఇంజనీర్ విద్యలో 6 ఏండ్లు గడిపితిని. పైగా నాకు నత్తిఉన్నది. సరిగా మాట్లాడలేను. ఒక చిన్నగుంపును చూశానంటె కాళ్ళలో వణుకు పుట్టుతుంది. సంగీతములో అయితే "సా" అంటె 'రి' రాదు; 'రి' అంటె 'గా' గాదు. ఇటువంటి పనికిమాలినవాణ్ణి నేను. నేనొక బోధకుడను కాగలనా?" ఆయన చిరునవ్వుతో వెళ్లిపోయెను. అప్పటినుండి ఎప్పుడెప్పుడు ప్రార్థనచేసినను, ఆయన నాచేతిని పట్టుకొనినట్లే తోచెను. "ఎందుకు వెళ్ళకూడదు? ఎందుకు వెళ్ళకూడదు?" అని అడిగినట్లే యుండెను. నా జవాబు ఇట్లుండెను. "ప్రభువా, నా సమస్తము నీకిచ్చివేస్తాను. నాకు ఇల్లువద్దు, మేడవద్దు, ఆస్తి వద్దు, మరేమియు వద్దు, నీ సేవకొరకు నా సంపాదనంతా ఇచ్చేస్తాను. దయచేసి బోధకుడు కమ్మని మాత్రం అడుగవద్దు." అప్పుడు ప్రభువు నాతో "నీ డబ్బు నాకవసరం లేదు. నీవే నాకు అవసరం" అనెను, తిరిగి ఇట్లు ప్రతిమాలితిని. "ప్రభువా, నా డబ్బు నీకిస్తాను. జీతాలిచ్చి, బోధకులను పెట్టించి, సువార్త పని చేయిస్తాను. ఆ పని వాళ్లు చక్కగా చేయగలరు. నన్ను బోధకునిగా చేయవద్దు." రెండు సంవత్సరముల పర్యంతము, "ఎందుకు వెళ్ళకూడదు? ఎందుకు వెళ్ళకూడదు?" అని దేవుడు అడుగుట మానలేదు. నేను ఆయనతో పోరాడుచు, పెనుగులాడుచుంటిని.

రెండు సంవత్సరములు గడచిన పిదప, యువకులకైన ఒక చిన్న కూటమందు దేవుడు నాతో మాట్లాడెను. ఆ కూటమందు ఒకరు లేచి, "ఏమండీ! ఇండియాలో క్రైస్తవ పరిచర్య విషయము కొంత చెప్పగలరా?" అని నన్ను అడిగెను. నేను లేచి నిలిచి, ఇండియాలో క్రైస్తవపరిచర్య విషయం నెపము

వేయుచు మాటలాడితిని. నా గదికి తిరిగి వెళ్ళితినిగాని, ఆ రాత్రి నా నోట ప్రార్థన రాకుండెను. అప్పుడు ప్రభువు ఇట్లనెను:- "రెండు సంవత్సరములుగా నామాటకు అవిధేయుడవైన నీవు నా సేవకులను నిందించుటకు నీకేమి హక్కుగలదు?" ఒక ఖడ్గమువలె ఆ మాటలు నన్ను పొడిచెను నేనిట్లు ప్రత్యుత్తరమిచ్చితిని- "ప్రభువా నావంటివాడు బోధకుడు కాగలడా? దేనినిబట్టి చూచినను నేను అంతా అయోగ్యుడనే. అయితే, నీవు నేనే కావలెనని అనుచున్నావు గనుక, ఇక నాయిష్టము కాదు. నీవు ఆఫ్రికా పంపుదువో, చైనా పొమ్మందువో, ఈ భూమి మీద ఇంకెక్కడికి నేను పోవలెనో నన్ను పంపుము. నేనుపోయెదను." ప్రభువు తిరిగి ఇట్లనెను. "మూడు షరతులమీద నీ పరిచర్యను అంగీకరింతును. నీ అక్కరలు ఏమైయుండినను డబ్బు విషయం గాని, వస్తు పదార్థ విషయములుగాని, దేని విషయం గాని నీవు ఎవరితోను చెప్పకూడదు. వారు నీ బంధువులే కాని లేక ఎక్కువ పరిచయం గల స్నేహితులేగాని. నోటితో చెప్పకుండినను ఇంకే విధంగానైనను వారు గ్రహించునట్లు నీవు ఉపాయములు చేయకూడదు. పంజాబులో నీకున్న ఆస్తి నీవు పొందకూడదు. నీ ప్రతిఅక్కర విషయం నన్నే నీవు నమ్ముకొనియుండవలెను. రెండవ షరతు: ఏ సంఘంలోను చేరవద్దు. మూడవది: నీ స్వంత ఏర్పాట్లు చేయవద్దు. ఏ దినం కాదినం నన్ను నడువనిమ్ము." "ప్రభువా, సమ్మతిస్తున్నాను" అంటిని. ఈ ప్రకారంగా తీర్మానమాయెను. అది ఏప్రిల్ 1932.

ఇప్పుడు ఎక్కడకు వెళ్ళవలెను? నా పరిచర్య ఏవిధంగా ప్రారంభించవలెను? నా కేమియు తెలవకుండెను. తెలిసినది ఒక్క విషయం—దిన దినము ప్రభువే నన్ను నడుపును. 1933

లో బొంబాయిలో దిగితిని. మా తల్లిదండ్రులు నన్ను కలిసి కొనుటకు అక్కడకు వచ్చిరి. అంతకు ముందు నా సాక్ష్య మిచ్చుచు నేను మా తండ్రికి ఒక ఉత్తరం వ్రాసియుంటిని. ఇప్పుడు ఆయన ఏమనెనంటే, "నీవు క్రైస్తవుడ వైతివని మీ తల్లికీ, నాకే తెలుసునుగాని, మేము ఎవరికినీ ఈ సంగతి చెప్ప లేదు. మాకైతే అభ్యంతర మేమి లేదు. నీవు యౌవనస్థుడవు. నీ యిష్టప్రకారమే చేయగలవు. అయితే, నీవు మన గ్రామానికి వచ్చినప్పుడు నీవు క్రైస్తవుడవని చెప్పుకోవద్దు. బైబిలు చదువుకో, ప్రార్థన చేయి, ఏ కూటాలకైనా వెళ్ళు, నిన్ను ఎవరు అడ్డగించరు. మేము ఒక్కటే నిన్ను బ్రతిమాలుచున్నాం నీవు క్రైస్తవుడవని చెప్పవద్దు. చెప్పితే మన సిక్కు జాతివాళ్ళంతా మనమీద సణుగుకొందురు" మా తల్లిదండ్రులు చాలా వైదికంగా నుండు సిక్కులు. నేను వారితో నిట్లంటిని—"ప్రభువైన యేసు నన్ను వెదకి రక్షించకుంటే, నేను ఒక పాపిగాను, అవమానపు పాడుపనులు చేసేవానిగాను తిరిగి వచ్చియుందును. నా సంపాద నంతా పాడు చేయుచుంటిని. దేవుడు నన్నిప్పుడు మార్చివేసి, నాకు క్రొత్త జీవమిచ్చెను. నేను ఊపిరి తీయకుండా జీవించ గలనా? ప్రభువైన యేసు క్రీస్తే ఇప్పుడు నా జీవము. ఆయ నను బొంకితే నేను జీవించగలనా?" "అట్లయితే నీవు ఇంటికి రావడానికి వీలులేదు." అని మా తండ్రిచెప్పిరి. ఏడేండ్లు ఇండి యాను విడిచి తిరిగి వచ్చియుంటిని. గాని, ఇంటికి పోవు భాగ్య ముండలేదు. నన్ను విడిచిపెట్టి మా తండ్రి వెళ్ళిపోయిరి. ఆయన యెడల నాకుండిన భక్తి చూపుచు నా వద్ద ఏమి పైకముండెనో అది ఆయనకు ఇచ్చివేసితిని.

బొంబాయిలో నున్న ఒక సత్రమునకు వెళ్ళితిని. ఒక వారం దినములు ఉచితంగా నాకొక గదిని యిచ్చిరి. అక్కడ

నా సామానులను పెట్టుకొని, రాత్రులలో పండుకొనుచుంటిని. పగటి పూట ప్రతిదినం బొంబాయి వీధులలో సాక్ష్యమిచ్చుచు, పత్రికలు పంచుచు తిరుగు చుంటిని. ఎవరైనను వినుటకు, ఇష్టపడిన యెడల, ఒక హోటలుకు నన్ను తీసుకొనిపోయి కాఫీ ఇప్పించుచుండిరి ఆదినమంతటికి అదే నాభోజనం. అదే ఎంతో రుచికరమైన భోజనం కూడాను.

మా తండ్రి నన్ను విడిచి తిరిగి పంజాబు వెళ్లుచుండగా రైలు బండిలో ఆయనకు ఒక స్వప్నము వచ్చెను. అందులో ఒక వృద్ధుడు కనబడి "నీ కుమారుని విషయం చింతించవద్దు. అతడు సత్య శాంతి పొందియున్నాడు. అతనిని తొందర పెట్ట వద్దు" అనిచెప్పెను. బొంబాయినుండి కరాచి వెళ్లితిని. నన్ను చూచుటకు మా తండ్రి అక్కడకు వచ్చి, "ఇంటికి రానాయనా నీకు దొరికిన శాంతి ఇప్పుడు నాకు తెలుసు' అని చెప్పి నన్ను ఇంటికి తీసుకొనిపోయిరి.

ఒకనాడు ఒక బహిరంగ కూటము జరిపితిమి. హిందువులు, మహమ్మదీయులు, సిక్కులు వచ్చిరి. చాలామంది లాఠీలు, రాళ్లు తెచ్చుకొనిరి. నేను నా సాక్ష్యమివ్వగా వెనుక కూర్చుండిన బలమైన వాడొకడు లేచెను. అతడొక వైద్యుడు. లేచి ఇట్లనెను. "ఏమయ్యా ఒక ప్రశ్న వేస్తున్నాము; దేవుడు ప్రేమయైయున్నాడు అని చెప్పుచూ, ప్రేమను గురించి అంత ఉపన్యాసము ఇస్తున్నావుకదా? మీ తండ్రిగారు నిన్ను ప్రేమించ డంలేదా? పై దేశాలలో ఉన్నప్పుడు నీ విద్య నిమిత్తం ఎంతెంతో డబ్బు క్రమంగా పంపలేదా? బాప్తిస్మం పుంచుకొనే ముందు ఆయన సమ్మతం పొందనం నీవిధి, నీ కృతజ్ఞము కాదా? ఇదేనా ప్రేమ? మీ తండ్రిని కొంత చూడు; ఆయన హృదయం ఎంత పగిలి పోయిఉన్నదో!" ముందు కూర్చుండిన మా తండ్రిలేచి

అతనికి ఈ జవాబిచ్చిరి. నా పేరు ఎత్తడం ఎందుకు? నా హృదయము పగిలిపోయిందని నేనెప్పుడూ అనలేదు. మీతో చెప్పినదెవరు? నాకు దొరకనిది ఏ మానవుడు పొందియున్నాడు. సత్య సమాధానం అతనికి దొరికినది. ఇక్కడున్న హిందూ, ముస్లిము, సిక్కుజనులలో ఎవరికైనా ఈ సత్య శాంతి దొరికినదా? మీరెవరైనా దానిని కలిగిఉంటేనే నా మాటలని ప్రశ్నించడానికి మీకు హక్కున్నది." ఒక్కడైనా జవాబు మాట్లాడలేదు. ఒక్కొక్కరే లేచి అందరు వెళ్ళిపోయిరి. ఆ గ్రామమందు సువార్త ప్రకటించుచు పది దినములుంటిని.

కొంతకాలం గడచిన తర్వాత దేవుడు మా తండ్రితో మాట్లాడెను. లాహోరు హైకోర్టులో ఒక వ్యాజ్యమందు ఆయన చిక్కుకొని యుండెను. ఒకనాటి ఉదయం మెక్లో (Mcclou) అనే దారిలో పోవుచుండగా పాతబడిన భవనమొకటి కనబడెను. కొంత విశ్రాంతి తీసుకుందామని అందులోనికి వెళ్లిరి. అకస్మాత్తుగా ఒక వెలుగు ఆయన యెదుట ప్రకాశించుటచూచి, ఈ మాటలు వినిరి.—"ఇదిగో, లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అప్పుడు మా నాయన "యేసుప్రభువా, నా కుమారుని రక్షించితివి, నన్ను రక్షించు"మనెను. ఈ విధంగా దేవుడు ఆయనను కలిసికొని ఆయన జీవితమును మార్చివేసెను.

మూడు సంవత్సరములవరకు మా తండ్రి బాప్తిస్మము పొందకుండిరి. ఆయన నాతో చెప్పినదేమనగా "బాప్తిస్మము అవసరములేదు. ప్రతి దినము బైబిలు చదువుతున్నాను. నిర్భయముగా సాక్ష్యమిస్తున్నాను. నేను సిగ్గుపడలేదు." ఇదంతయు సత్యమే. ప్రతిదినము తెల్లవారు మూడు గంటలకు లేచి మా తల్లిని లేపుదురు. ఆమెకూడ వినవలెనని బిగ్గరగా బైబిలు చదువుదురు. "బాప్తిస్మము పట్టి ఆచారమే. అది లేకుంటేనేమి?"

అందుకు. నేనేమియు అనలేదు. ప్రార్థన మాత్రము చేసితిని. ఒకరాత్రి స్వప్నమందు వెడల్పైన ఒక నదిని చూచితిని. నేనొక ఒడ్డున, మా తండ్రి మరియొక ఒడ్డున నుంటిమి. చూచు చుండగా మా తండ్రి నా వైపు ఈదుచు వచ్చుచుండెను. చాలా కష్టముతో ఆయన ఊపిరి తీయుచున్నందున, నేను వంగి నీటి నుండి ఆయనను పైకిలాగితిని. ఇంతలో మేలుకొంటిని. ప్రభువా ఈ స్వప్నముయొక్క అర్థము నాకు చూపు" మంటిని. "మా తండ్రి త్వరలో ఈ లోకము విడిచి పెట్టునని దేవుడు నాకు బయలుపరచెను. మరణనది యోర్దానును ఆయన దాటవలసి యుండెను గాని వెళ్లుటకు ఆయన సిద్ధముగా నుండలేదు. "నీవు ఆయన యొద్దకు వెళ్ళుము." అని దేవుడు సెలవిచ్చెను. నేను మా తండ్రి దగ్గరకు వెళ్లి, "నాయనా, ఏ విషయమైనా దేవుడు మీతో మాట్లాడెనా ?"అని అడిగితిని. చిరునవ్వు నవ్వి మద్రాసుకు పోయి బాప్తిస్మమందు సాక్ష్యమిమ్మని చెప్పెనని నాతో చెప్పిరి. 1945 డిసెంబరు మాసము మద్రాసు వచ్చిరి. క్రిస్మస్ దినమున బాప్తిస్మము పొందిరి. మూడు గంటలు మాటలాడుచు తన సాక్ష్యమిచ్చిరి. నీటినుండి ప్రకాశించుచున్న ముఖముతో వెలుపలికి వచ్చినతరువాత ఇట్లనిరి. "బాప్తిస్మములో సాక్ష్యమివ్వడము ఇంత ఆశ్చర్యకరమైన సంగతి అని ఇంతకుముందే నీవెందుకు నాతో చెప్పలేదు?"అని అనిరి.

అటువెనుక మా తండ్రి తిరిగి పంజాబు వెళ్ళిపోయిరి. నాకు అయిదుగురు తమ్ముళ్ళున్నారు. ఒక్కొక్కని దగ్గరకుపోయి- "నేను నీ తండ్రిని, నీవు నాకుమారుడవు. నీకు విద్య ఇప్పించితిని. వివాహము చేసితిని. చేయవలసినవన్ని నీకు చేసితినిగాని, ఒక్కలోపం మాత్రం ఉన్నది. రక్షణమార్గము నేను నీకుచూపలేదు. దయచేసి క్షమించు. ఇది నాకే తెలిసియుండలేదు. ఇప్పుడు

ఇదొక్కటే మార్గం అని నీకు చెప్పుటకు వచ్చితిని. దేవుని రాజ్యం లోనికి నీవు రావలెనంటే ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచి నీవు తిరిగి జన్మించవలెను.'' అనిఆయనచెప్పెను.

దేవుడు నాకు కనబరచిన రీతిగానే జూలై 1946 లో ఆయన పరలోకగతుడాయెను. చనిపోయేముందు మా చెల్లెలిని పిలిచి ''బిడ్డా, ఈ మూడురోజులే ఉందును. తరువాత నన్ను చూడవు'' అనిరి. ఆమె ఏడ్చెను. "నా నిమిత్తం ఏడ్వకు, నీ విషయమే నీవు ఏడ్వవలసినది; భూమిమీద నా కాలం తీరిపోయింది. వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నాను. నన్ను తీసికొని వెళ్లుటకు దేవదూతలు వస్తున్నారు, నాకు కనబడుచున్నారు. నా బిడ్డా, నాకొరకు ఏడ్వవద్దు. నేను వెళ్లిపోయేముందు అందరితో సమాధానపడవలెను. నా అన్నదమ్ములందరిని, చుట్టాలందరిని పిలవమ్మా'' అనిచెప్పెను. ఒకరి వెనుక నొకరు వచ్చిరి. వారితో 'నేనునీకు ఏమైనాకీడుచేసిఉంటే దయచేసిక్షమించు'మనిరి.

ఆయన అన్నదమ్ములలో ఒకతనురాకుండెను. ఎన్నో సంవత్సరంల నుండి కుటుంబ కలహంలుండెను. ఎందుకనగా మా తాతగారి సొత్తు అయియుండిన ఒక ఇత్తడిపాత్రను గురించియే. పెద్దవిందులు చేయునప్పుడు ఉపయోగింపబడు చుండిన చాలా పెద్ద దేషా అది. మా తాతగారు మరణించగాఆయన సొత్తును కుమారులు పంచుకొనిరి. మా తండ్రియు, తన సహోదరుడును పాత్రకొరకు జగడం వేసుకొనిరి. తుదకు మా తండ్రి బలవంతముగా దానిని తీసికొనిరి. ముప్పది అయిదు ఏండ్లు గడిచినను మా తండ్రి సహోదరుడు ఆయనతో మాటలాడకుండెను. "నా దేషాను లాగివేసికొంటివికదా? నేనెందుకువస్తాను?'' అని ఆయన కబురుపెట్టెను. అప్పుడు మాతండ్రి మా చెల్లెలిని ఆయన అన్నగారిని పిలుచుకొని రమ్మని మరల పంపిరి. తిరిగి మా పెద్ద

తండ్రి "నేను రాను" అని చెప్పిరి. మూడవమారు కూడ రాక నాలుగవమారు ఉయునవచ్చిరి. మా తండ్రి ఏడ్చుచు- "నేను నిన్ను దుఃఖపెట్టి నీ హృదయాన్ని గాయపర్చితిని. నన్ను దయతో క్షమించు. సమయము వచ్చింది. నీతో నేను సమాధానపడాలి" అని చెప్పగా మా పెద్దతండ్రి ఆయనను క్షమించెను. ఇరువురు ఏడ్చిరి. సత్య సమాధానముతో మా తండ్రి ఈ లోకమును విడిచిరి.

ఎంత ప్రేమతో దేవుడు వెదకి రక్షించుచున్నాడో! నన్ను వెదకి రక్షించుటకు సకలసాధనములను ఉపయోగించుచుండెను. నాకు పుట్టుక ఏమియు తెలియకుండెను. బైబిలును చింపివేసిన పాపి మరొకడుండడు. ఇవన్నియు దేవుడు ఎరిగినవే. నేనుచేసిన పాపం ఇంకెవరును చేసియుండరు. నన్నెట్లు ఆయన వెదకెనో, నిన్నుకూడ అట్లే వెదకుచున్నాడు. ఎందరో నీ కొరకు ప్రార్థన చేయునట్లుగా ఎందరిపైన భారము పెట్టియుండెనేమో. అది నీకు తెలిసియుండలేదు. ఇప్పుడు సమయం వచ్చెను. ఆయన నీ హృదయం యొక్క తలుపును తట్టుచున్నాడు. నీ పాపం క్షమించ గోరుచున్నాడు. నీ పాపం లెన్నియైనను, ఎంత ఘోరమైనను, ఆయన నీతో ఈ మాటలు చెప్పుచున్నాడు— "నా కుమారుడా, నా కుమారీ, ధైర్యముగా నుండుము, నీ పాపములు క్షమింపబడియున్నవి." ఆయనను అంగీకరించవా? నిన్ను ఆయన ప్రేమించుచున్న దానికంటె అధికముగా ఎవరు ప్రేమింపజాలరు. దేవదూషకుడనై నరకాగ్నికి తగియుండిన నావంటి వానినే క్షమించినయెడల నిన్నునూ ఆయన నిశ్చయముగా క్షమించును. ఆయనను నీ హృదయంలో చేర్చుకొనుటకు ఆలస్యము చేయవద్దని నేను నిన్ను వినయముతో కోరుచున్నాను. ఆయనవైపు చూచి రక్షణపొందుము.